ప్రజాశక్తి

Vol. 7, no. 22

(Nov. 28, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 7, no. 22

(Nov. 28, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Regd. No M. 4486

0-2-0

ప్రజాశక్తి

సంపుటి 7 బుధవారం 28—11—45 సంచిక 22

డిసెంబరు 3
అజాద్ హింద్ ఫౌజు డిఫెన్సునిధికి సహాయం చేయండి!

•

భారతకమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీసభ్యుడు కామ్రేడ్ సుందరయ్య ఆంధ్రరాష్ట్ర మంతటా డిసెంబరు 3 వ తేదీని అజాద్ హింద్ ఫౌజు డిఫెన్సునిధికి విరాళాలు వసూలుచేయ వలసిందని పార్టీ సభ్యుల్ని హెచ్చరిస్తున్నారు.

కలకత్తాలో కాల్పులు

కమ్యూనిస్టు నాయకుల ఖండన

అజాద్ హింద్ ఫౌజువల్ల సానుభూతిని ప్రకటిస్తూ సభలుగాని, ఊరేగింపులు గాని జరపకూడదని దేశమందంతట విశేషాజ్ఞలు జారీచేయబడ్డాయి. కలకత్తాలో యీ నెల 21, 22, 23 తేదీలలో యీ ఆజ్ఞల నుల్లంఘిస్తూ పెద్ద పెద్ద ప్రదర్శనలు జరిగాయి. గుంపులమీద పోలీసులు తుపాకులుకాల్చారు. తత్ఫలితంగా 35 గురు చనిపోయారు. 300 మందికి గాయాలు తగిలాయి. చాలా మిలిటరీ లారీలకు గుంపులు నిప్పటించారు. 23 గురు అమెరికన్ సైనికులకు దెబ్బలు తగిలాయి. మొదటిరోజున చట్టధిక్కారం చేసే విద్యార్థుల్ని తిరిగి వెళ్ళిపోవలసిందిగా శరత్ చంద్రబోసు ఎన్నిసార్లు సందేశం పంపినప్పటికీ, విద్యార్థులు వినలేదు. కాల్పులకు ముందు ఆయన ఈవిధంగా కట్టకడపటి సందేశం పంపించాడు:

"విద్యార్థులారా, మీ చర్యలవల్ల నా గుండె పగిలిపోయింది. మీకో క్రమశిక్షణలేదు. తిరిగి వెళ్ళిపోవలసిందని రెండు డజన్లసార్లు మీకు విజ్ఞప్తిచేశాను. ఐనా మీరు వినలేదు. ఆఖరుసారి నేను మీకు చేసే విజ్ఞప్తి ఏమంటే: ఇప్పుడైనా మీరు ప్రశాంతంగా తిరిగి వెళ్ళండి"

కాని, విద్యార్థులు వినలేదు. పోలీసులపై రాళ్ళవర్షం కురిసింది. పోలీసులు తుపాకులు కాల్చారు.

22, 23 తేదీలలో కూడా అనేక వీధులలో ఊరేగింపులు, ప్రదర్శనలు జరిగాయి. పోలీసులు గుంపులమీద తుపాకులుకాల్చారు. 22 వ తేదీ సాయంత్రం శరత్ బోసు యీ క్రింది విధంగా ఒక ప్రకటన చేశాడు:

"రాజకీయ జీవితంలో 3దశాబ్దాలఅనుభవం గల వాణ్ణి. నేరస్థులెవరో కనుగొనడం కష్టంకాదు. ఎవరు యీ ఘటనలకు కారకులో నాకుతెలుసు కాంగ్రెసు ఉద్యమాన్ని నాశనం చేయడమే వారి ఉద్దేశం. వారిలో కొందరు మొన్న మొన్నటివరకు అజాద్ హింద్ ఫౌజు పంచమాంగదళమని ప్రచారం చేసి, ఇప్పుడు ప్రజల్లో పలుకుబడిని సంపాదించడంకోసం అజాద్ హింద్ ఫౌజు వల్ల తమకెంతో సానుభూతి ఉన్నట్లుగా ప్రకటించుకొంటున్నారు."

శరత్ బోసు బెంగాల్ గవర్నరుకు రాసిన లేఖలో కూడా, ఏజంట్ ప్రొవొకేటర్లు(అంటే ప్రజల్ని రెచ్చగొట్టి, తరువాత వారినే పట్టించి యిచ్చువారు) దీనికంతకూ కారకులని తెలియచేశాడు.

22 వ తేదీ సాయంకాలం భారత కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీసభ్యుడైన కామ్రేడ్ రణేన్ సేన్ అధ్యక్షతక్రింద మహమ్మదాలీ పార్కులో బ్రహ్మాండమైన కార్మికమహాసభ జరిగింది. వివిధ పరిశ్రమలలో పనిచేసే కార్మికులు ఆరోజున సమ్మెకట్టి, మహాసభకు తండోపతండాలుగా వచ్చారు. ప్రధానమైన కొన్ని తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి. కాల్పుల సందర్భంలో అరెస్టు చేయబడిన వారందరినీ వెంటనే విడుదలచేయాలనీ, కాల్పులకు కారకులయిన వారిని విచారించి శిక్షించుటకు ప్రభుత్వం ఒక అనధికార విచారణ సంఘాన్ని నియమించాలనీ తీర్మానాలు జరిగాయి. ఈ కోర్కెలు అమలు జరిగేటా చూడ్డానికి అన్ని పార్టీల ప్రతినిధులు ఉన్న ఒక "కౌన్సిల్ ఆఫ్ ఏక్షన్" ఏర్పడాలనికూడా సభలో తీర్మానింపబడింది.

సుందరయ్యగారి విజ్ఞప్తి

భారత కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య క్రింది విధంగా ప్రకటిస్తున్నారు:

"అజాద్ హింద్ ఫౌజు సైనికులను యెట్టి విచారణ చేయకుండా విడుదల చేయమని భారతదేశంలోని అన్ని పార్టీలు కోరేయి. ప్రభుత్వం ప్రజల కోర్కెను పెడచెవినిపెట్టి, విచారణను కొనసాగిస్తూనే ఉంది. దేశంలో ఆలజడి, ఆందోళన పెరిగిపోతూంది. కలకత్తాలో అజాద్ హింద్ ఫౌజు సైనికుల్ని విడుదల చేయాలంటూ కోరే ఊరేగింపులమీద పోలీసులు తుపాకులు కాల్చారు. 35 మంది చనిపోయారు. 300 మందికి గాయాలు తగిలాయి. బొంబాయిలో కూడా కాల్పులు. దేశమంతటా నిరసన సభలు, హర్తాళాలు, జరుగుతున్నాయి. మద్రాసు రాష్ట్ర మంతట యీ నెల 21 వ తేదీనుంచి అజాద్ హింద్ ఫౌజుకు సంబంధించిన యెట్టి సభలు పెట్టకూడదని విశేషాజ్ఞలు జారీచేయబడ్డాయి.

"కలకత్తా కాల్పులపట్ల నిరసన తెల్పుతూ బెంగాల్ కమ్యూనిస్టు కమిటీ రవాణా పనివారలచేత సమ్మె చేయించింది. అనేక స్థలాలలో కమ్యూనిస్టుపార్టీ అజాద్ హింద్ ఫౌజు సైనికుల్ని విడుదల చెయ్యాలని ఇది వరకే ఎన్నో సభలలో తీర్మానాలు చేసింది. ప్రజాభిప్రాయాన్ని తృణీకరిస్తూ సభలను నిషేధించడంద్వారా, నిరసన తెల్పే ప్రజలపై తుపాకులు కాల్చడంద్వారా, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ప్రజాభిప్రాయాన్ని అణచలేరు.

"అజాద్ హింద్ ఫౌజు జపానుతో కలిసి భారత దేశ స్వాతంత్ర్యాన్ని సాధిస్తామని కోరడం పూర్తిగా తప్పని సందా అది కమ్యూనిస్టుపార్టీ ప్రకటిస్తూవచ్చింది. బ్రిటిష్ ప్రభుత్వంపైగల ద్వేషంతో జపానుతో కలియడం స్వాతంత్ర్యానికి మార్గం కాదని తెలియచేస్తూ వచ్చింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అజాద్ హింద్ ఫౌజును విచారించడానికి పూనుకున్నారంటే, అది జపానుతో కలిసి భారత దేశానికి ఫాసిస్టు ప్రమాదం తెచ్చిపెట్టినందుకు కాదు: తమ్మువ్యతిరేకించిన వారిపై పగ సాధించడానికి.

"ఒక వైపు జావా, ఇండో చైనాలలో స్వాతంత్ర్యోద్యమాలను అణచడానికి జపాన్ సైనికుల్ని ఉపయోగిస్తూ, మరొకవైపు మన దేశంలో తానేదో ఫాసిస్టు వ్యతిరేకిగా నటనకోసం అజాద్ హింద్ సైనికుల్ని శిక్షించడానికి బ్రిటిష్ ప్రభుత్వానికి హక్కు లేదు.

"బ్రిటిష్ ప్రభుత్వంపై గల ద్వేషంతో తప్పుద్రోవ తొక్కి, జపాను ఫాసిస్టుల కింద తరిఫీదయిన యీ అజాద్ హింద్ ఫౌజు సైనికుల్ని మన ప్రజలే సరియైన మార్గాన పెట్టడానికిప్రయత్నించాలి. వారికి తప్పును తెలియచేసి, మన ప్రజల కోసం పనిచేసే ప్రజాతంత్ర వాదులుగా వారిని తయారుచెయ్యాలి. ఈ పనిని మన ప్రజలే చేయగలరు. అందువల్లనే, కమ్యూనిస్టుపార్టీ వీరినందరినీ విడుదలచేసి తిరిగి ప్రజలమధ్య నివసిస్తూ పని చేయడానికి అవకాశమివ్వాలని ఆందోళన చేస్తూంది.

"బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తిరిగి 1942 ఆగష్టునాటి పరిస్థితులను తెచ్చిపెట్టి, మన పౌరసత్వహక్కుల్ని హరింప జూస్తున్నారు. ఎన్నికలముందు పోలీసుల రాజ్యాన్ని ఏర్పరచి ప్రజల నణచివేయాలని చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలుపోలీసులవలలో చిక్కకుండా జాగ్రత్తపడాలి.

"అజాద్ హింద్ ఫౌజ్ సైనికుల విచారణకు ధనం అవసరం. వారి కుటుంబాలకు కూడా సహాయం కావాలి. కమ్యూనిస్టుపార్టీ సభ్యులందరు ఇతర దేశభక్తులతో కలిసి డిసెంబరు 3 వ తేదీని ఇద్దరు ముగ్గురుగా ఇంటింటికి వెళ్ళి ధనం పోగుచెయ్యాలని కోరుతున్నాను. దాన్ని అనసారీ, అజాద్ హింద్ ఫౌజు రిలీఫ్ కమిటీ (ఢిల్లీ) అనే చిరునామాకు పంపగోరెదను."

అజాద్ హింద్ ఫౌజు ★

★ అధికారుల విచారణ

అజాద్ హింద్ ఫౌజు అధికారులైన కెప్టెన్ షానవాజ్, సైగల్, గురుబక్షదిలాన్ల విచారణ ఢిల్లీలో యీ నెల 21 వ తేదీని తిరిగి ప్రారంభమైంది. ప్రభుత్వం తరపున లెఫ్టినెంట్ నాగ్ సాక్ష్యం చెబుతూ, 1943 అక్టోబరు 21 వ తేదీని సింగపూరులో "భారత స్వాతంత్ర్య ప్రభుత్వం" ఏర్పడిందనీ, సుభాష్ చంద్రబోసు 5000 మంది ఉన్న బహిరంగ సభలో ప్రభుత్వసభ్యుల పేర్లను చదివాడనీ తెలియజేశాడు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యంసిద్ధించేటట్లు చేయడమే ఈప్రభుత్వంయొక్క ఆశయమని బోసు తన ప్రకటనలో తెలియజేశాడు. మొదటి అజాద్ హింద్ ఫౌజులో ఒక అధికారిగా వున్న కెప్టెన్ మోహన్ సింగును జపాన్ అధికారులు అరెస్టు చేశారు. మోహన్ సింగ్, తన కడ్డువచ్చే ఎవరితోనైనా సరే (జపానుతో సహితం) పోరాడుతానని ప్రకటించాడు. అందువల్ల అతన్ని అరెస్టుచేశారు. జపాన్ ప్రభుత్వం యొక్క చెప్పుచేతల్లో అజాద్ హింద్ ఫౌజు ఉండరాదని అప్పట్లో అందరూ అభిప్రాయపడేవారు. రెండవ అజాద్ హింద్ ఫౌజు ఏర్పడ్డాకకూడా యీ అభిప్రాయం ఉండేది.

22 వ తేదీని రెండవ ప్రభుత్వ సాక్షియైన కెప్టెన్ ధర్గాల్కర్ యిలా చెప్పాడు: కెంపెటాకి క్యాంపులో భారత సైనికుల్ని ఆరుబయట ఎండవానలలో ఉంచేవారు. కొందరిని కొట్టి హింసించేవారు కూడ. బుల్లర్ క్యాంపులో భారత యుద్ధఖైదీలను చెట్లకు కట్టి, కొట్టేవారు.

మరొక ప్రాసిక్యూషన్ సాక్షి సుబేదార్ మేజర్ బాబూరామ్ తన సాక్ష్యంలో యిలా చెప్పాడు: కల్నల్ హంట్ (బ్రిటిష్ సైనికాధికారి) తన సైనిక దళాన్ని జపాన్ అధికారులక్కు వప్పజెప్పుతూ, అంతవరకు బ్రిటిష్ ప్రభుత్వపు ఆజ్ఞల నెలా వారు పాటించారో, అలాగే జపాను ఆఫీసర్ల ఆజ్ఞలను కూడా పాటించమని ఉద్బోధించాడు. మొదట నేను ఇష్టపూర్వకంగానే అజాద్ హింద్ ఫౌజులో చేరాను. భారతదేశ దాస్య సంకెళ్ళను సడలించడానికే నేనలా చేరాను. కాని, రెండవసారి ఎందుకు చేరలేదంటే, జపాన్ ప్రభుత్వం రెండవసారి కూడా పంచమాంగదళంగా ఉపయోగించు కొంటుందనే భయంవల్ల.

నాల్గవ ప్రాసిక్యూషన్ సాక్షి జమేదార్ ఇతాఫ్రజాక్ తన సాక్ష్యంలో యిలాచెప్పాడు: 1945 మార్చి 20 వ తేదీని లెఫ్టినెంటు కల్నల్ సైగల్ అజాద్ హింద్ ఫౌజు అధికారుల సమావేశం ఒకటి జరిపాడు. ఆ సమావేశంలో ఎవరైనా ఇష్టపూర్వకంగానే సైనికులుగా చేరవచ్చునన్నాడు. నాయక్ సంతోష సింగ్, గంగారాంలు కూడా తమ సాక్ష్యంలో యిలాగే చెప్పారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం యివ్వాలి

బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ ప్రతిజ్ఞ

ఈనెల 24 వ తేదీని బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ సర్వసభ్య సమావేశం లండన్‌లో ప్రారంభమైంది. మొత్తం 60,000 మంది పార్టీసభ్యుల తరఫున 800 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈసమావేశంలో, ప్రస్తుతమున్న లేబర్ ప్రభుత్వం ఇండియాపట్ల అనుసరిస్తున్న విధానాన్ని ఖండిస్తూ 12 తీర్మానాలు ప్రతిపాదించబడ్డాయి: వాటన్నిటి సారాంశం క్రోడీకరించి ఒకే తీర్మానంగా చేయబడింది. బ్రిటిష్ ప్రభుత్వం వెంటనే ఈ హామీలను అమలు జరపాలని సూచించారు.

భారతదేశంలో యుక్తవయస్సు వచ్చిన ప్రతి భారతీయునికి వోటింగుహక్కు ఉండే జాబితాను తయారుచేయాలి. రాజకీయ ఖైదీలందరినీ విడుదలచేయాలి. పౌరసత్వహక్కులను అణచే శాసనాలను తొలగించాలి. వివిధ రాష్ట్రాలలో ప్రజాప్రతినిధులున్న ప్రభుత్వాలను నెలకొల్పాలి. కేంద్రంలో కాంగ్రెసు - లీగు పార్టీలకు సమాన ప్రాతినిధ్యం ఇస్తూ అల్ప సంఖ్యాక వర్గాలకు కూడా కొన్ని స్థానాలిచ్చి, కేంద్ర ప్రభుత్వాన్ని నిర్మించాలి. స్వదేశ సంస్థానాలలో సంస్థానాధీశ్వరుల ప్రతినిధులుగాక ప్రజల ప్రతినిధులు ప్రభుత్వంలోఉండాలి.

ఆ తీర్మానంలోనే, క్రిప్స్ ప్రతిపాదనతో కూడిన ప్రభుత్వ ప్రకటన లోపభూయిష్టంగా ఉంది గనుక, దాన్ని తోసివెయ్యాలన్నారు. దానిస్థానే సర్వాధికారాలు గల రాజ్యాంగ నిర్మాణసభకు ఎన్నికలు జరగాలని, అసభ ఎట్టి రాజ్యాంగాన్ని కోరితే దానికి ప్రభుత్వం అంగీకరించాలని, తెలియజేశారు.

"ప్రపంచ శాంతికి, సౌభాగ్యానికి బానిస భారతదేశం పెద్ద ఆటంకం. ప్రపంచ ప్రజలందరి మేలుకోసం, ముఖ్యంగా బ్రిటిషు ప్రజల మేలుకోసం, భారతదేశం స్వాతంత్రం పొందాలి. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చటానికి కమ్యూనిస్టుపార్టీ శక్తివంచనలేకుండా కృషి చేయడానికి ప్రతిజ్ఞ చేస్తుంది" అని కూడా తీర్మానంలో వుంది. బ్రిటిష్ కమ్యూనిస్టు నాయకుడు హారీపాలిట్ తన ఉపన్యాసంలో, పై హామీలను బలపరుస్తూ మాట్లాడేరు.

★

'ముస్లింలు త్యాగంచేయ లేదనడం పొరపాటు' — జిన్నా

ఈనెల 20 వ తేదీని జిన్నా పెషావర్‌లో ఉపన్యసిస్తూ యిలా చెప్పారు:

"ముసల్మానులు దేశంకోసం త్యాగంచేయ లేదనడం పొరపాటు. 1921 లో జరిగిన ఆందోళనలో ముసల్మానులే పోరాటానికి ముందు నిలిచారు. 1932 లో పెషావర్ ముసల్మానులు స్వాతంత్ర్యంకోసం తమ ప్రాణాలర్పించారు. ఆ రోజుల్లో హిందువులు సరిహద్దురాష్ట్రానికి కొన్ని సంస్కరణలను కూడా వ్యతిరేకించారు రౌండ్‌టేబుల్ సమావేశాలలో (లండన్) కూడా వారలా వ్యతిరేకించారు.

"ఎప్పుడైతే ముసల్మానులకు వారి వారి జన్మభూములలో సంపూర్ణ స్వాతంత్ర్యం ఇస్తామని వాగ్దానం చేస్తారో, అప్పుడు వారు హిందువుల్ని మించి త్యాగాలు చేస్తారు. ప్రజల్ని తుపాకిగుండ్లకు ఎదురురొమ్ము యిచ్చునట్లు, లేదా జైళ్ళకు వెళ్ళేటట్లు చేసి తరవాత జైల్లోనుంచి తమకేట్టి సంబంధం లేదని ప్రకటనలు చేయడం; తరవాత విడుదలయినవ్యాక ప్రజలు చేసినత్యాగాలకు ప్రయోజకత్వం తమదేనని చలామణీ చేయడం, సరియైనపద్ధతికాదు: సవ్యమైనరాజకీయాలుకావు.

ముస్లిం కాంగ్రెసుమంత్రి రాజీనామా

ఈనెల 20 వ తేదీని పెషావరులో సరిహద్దురాష్ట్ర ముస్లిం లీగు మహాసభ ప్రారంభమైనప్పుడు ప్రస్తుతపు కాంగ్రెసు మంత్రి వర్గంలో ఒకరైన ఖాన్ మహమ్మద్ అబ్బాస్ ఖాన్ కాంగ్రెసునుండి రాజీనామానిచ్చి ముస్లిం లీగులో చేరినట్లు ప్రకటించారు.

కంచుకాగడా

ఆంధ్రపత్రిక "జాతీయత"

ప్రారంభంలో బ్రిటిష్ ప్రభుత్వ జోహుకుందారు: పబ్లిక్ ప్రాసిక్యూటరు: తరువాత కాంగ్రెసు అధికారంలోకి వచ్చినప్పుడు కాంగ్రెసు టిక్కెట్టుతో ఛైర్మన్: కాంగ్రెసు మంత్రివర్గాలు రాజీనామా యిచ్చినప్పుడు పల్లపల్లగా కాంగ్రెసునుంచి జారిపోయి, గవర్నమెంటు మద్దత్తుదారు - ఇది. మూడుముక్కలలో చెప్పాలంటే, రావుబహదూర్ మద్దిపట్టాభిరామిరెడ్డి రాజకీయ చరిత్ర. రాజకీయాలను స్వలాభంకోసం ఉపయోగించుకోవడమే ఇతని లక్ష్యం. ఇతనిప్పుడు గంజాం - విశాఖ జిల్లాలకు కేంద్రశాసనసభ నియోజకవర్గంలో కాంగ్రెసు అభ్యర్థికి పోటీగా నిల్చున్నారు. ఈ పరిస్థితుల్లో ఇతన్ని వ్యతిరేకించి, కాంగ్రెసు అభ్యర్థిని గెలిపించడం దేశక్షేమాన్నికోరే వారందరికర్తవ్యం. కాంగ్రెసునాయకత్వంతో తీవ్రమైనఅభిప్రాయభేదాలున్నప్పటికీ కమ్యూనిస్టుపార్టీ ఈ వైఖరినే అవలంబించింది.

కాని జాతీయత అంతా తన గుత్తసొమ్మైనట్లుప్రవర్తించే 'ఆంధ్రపత్రిక', ఆంధ్ర కాంగ్రెసు నాయకులకు తలలో నాలుకగా ఉండే 'ఆంధ్రపత్రిక' ధోరణి ఏమిటి? మొన్న 21 వ తేదీ సంచికలో మొదటిపేజీలో 'ఆంధ్రపత్రిక'అనే శీర్షికకు ప్రక్కగా మద్దిపట్టాభిరామిరెడ్డిగారికి తమ ఓట్లను దయచేయమని గంజాం, విశాఖజిల్లా ప్రజలను కోరుతూ ఒక ప్రకటన ఉంది. ఇది అడ్వర్టైజ్‌మెంటు అయితే దీనికి వచ్చేది స్వల్ప ధనం మాత్రం. ఈ స్వల్పానికి ఆశపడి, జాతీయ వ్యతిరేకికి ఓటివ్వమని కోరడం యేమి జాతీయతో 'ఆంధ్రపత్రిక'కే తెలియాలి. ఇది 'దేశోద్ధారకులు'విడిచిపోయిన సాంప్రదాయాలను కొనసాగించడమేనేమో ఆలోచించాలి.

ప్రకాశంగారి బెదరింపులు

వీరవాసరంలో ప్రకాశంగారు వందమంది ఎదుట ఉపన్యసిస్తూ ఇలా అన్నారు: "కమ్యూనిస్టులు పిల్లకాయలు. కమ్యూనిజమంటే వారికి తెలియదు.........మేమేమంత్రులుగా వస్తాము. మాకే ఓటివ్వండి. లేనట్లయితే జాగర్త.... ప్రభుత్వం మా చేతుల్లో ఉంటుంది. కనుక మీరు వ్యతిరేకంచేశారా, జాగర్త: ఏప్రిల్ 15వ తేదీన మా ప్రభుత్వం రాబోతున్నది. మీసంగతి ఏమవుతుందో చూడండి: జాగర్త.... "మీ గొంతులు మీరుకోసుకోకండి...." (19-11-45 రిపోర్టులు)

మైలవరంలో 16-11-45 న 250 మంది ఎదుట ఉపన్యసిస్తూ ప్రకాశంగారు ఇలా అన్నారు: "....కాంగ్రెసుతోపాటు జైళ్ళకు పోతే ప్రభుత్వం ప్రాణాలతో వదిలిపెట్టదు. చచ్చిపోతామని భయపడి కమ్యూనిస్టులు కాంగ్రెసును వ్యతిరేకించారు.... ఏప్రిల్ మొదటి వారంలోనే రాష్ట్ర స్వరాజ్యం, రాష్ట్ర స్వాతంత్ర్యంస్థాపిస్తాం. స్వరాజ్యం 3 మాసాలలో వస్తుంది.... 4 మాసాలలో మేం మంత్రులుగా వస్తే కమ్యూనిస్టులు ఎవరిదగ్గరకుపోతారు.... 4 మాసాలలో స్వరాజ్యంవస్తుంది. మతిపోయి కమ్యూనిస్టులు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ......ఇప్పుడు మీరందరూ కాంగ్రెసుకు వోటివ్వకపోతే, అయ్యో ఎందుకివ్వలేదా అని మేము మంత్రులమయిన తరువాత మీరు ఏడుస్తారు........"

రావులపాడులో కమ్యూనిస్టులమీద కుట్ర

ఎవరైనప్పటికి వారు కమ్యూనిస్టులకు శత్రువులైతేచాలు, నేటి కమ్యూనిస్టు వ్యతిరేక కాంగ్రెసు నాయకత్వం, తమ కులంలో కలుపుకొని, కాంగ్రెసు చక్రాంకితాలు వేసేస్తుంది. దీనికి ఉదాహరణగా యీ కథ వినండి:

కృష్ణాజిల్లా రావులపాడు గ్రామంలో అయోధ్యరామయ్య అనే వ్యక్తి ఉన్నాడు. ఆయన మొదటి రావులపాడుకేసులో కమ్యూనిస్టువ్యతిరేకుల పక్షాన ఒక ముద్దాయి. వెంకటాద్రి అనే అతను యింకో ముద్దాయి. 18-11-45 న తేదీ అర్ధరాత్రివేళ వెంకటాద్రి అయోధ్య రామయ్య ఇంట్లో ప్రవేశించాడు. వెంటనే అయోధ్యరామయ్య లేచి, వెంకటాద్రిని యిరుగు పొరుగువారి సహాయంతో పట్టుకున్నారు. మొట్ట మొదట సహాయపడినది జూపూడి అంజయ్య అనే ఒక కోమటి. ఈయిద్దరూ కలిసి వెంకటాద్రిని దొడ్లోవున్న ఒక చెట్టుకి కట్టివేశారు.

తెల్లవారిన తరువాత, ఎంక్వయిరీకి హెడ్ కానిస్టేబులు వెళ్ళి, స్టేట్‌మెంట్లుతీసుకున్నారు. అయోధ్యరామయ్య తన స్టేటుమెంటులో తనను వెంకటాద్రి గొంతుక పిసికి చంపబోయాడని, ఎలాగో పట్టువిడిపించుకొని అతన్ని గట్టిగా పట్టుకొని కేకలువేశానని, ఆకేకలకు జూపూడి అంజయ్య అనే పొరుగింటి కోమటి వచ్చాడని, ఇద్దరూ కలిసి వెంకటాద్రిని చెట్టుకుకట్టి డ్యూటీలోవున్న కానిస్టేబులికి వప్పజెప్పామని, చెప్పారు.

వెంకటాద్రి స్టేటుమెంటులో, తాను గేదె బేహారికి జేబులో రు. 100 వేసుకొని తెల్లవారుజామున బయల్దేరినట్లు, కమ్యూనిస్టులు ఒంటరిగా ఉండటం చూచి తనను పట్టుకొని డబ్బు లాగుకొని చెట్టుకు కట్టివేసినట్లు చెప్పాడు. నలుగురు కలిసి తనను కట్టివేసినట్లు చెప్పాడు.

దీన్నిబట్టి తేలేది ఏమంటే: వెంకటాద్రి తననేరాన్ని కప్పిపుచ్చుకొని, దాన్ని కమ్యూనిస్టులమీదికితోస్తే, "పాపాలన్నిటికి భైరవులు" కమ్యూనిస్టులే గనుక, పోలీసులు వారి మీద విరుచుకుపడతారు:

ఈ కుట్రను కేశవరపు లక్ష్మీనరసింహారావుగారువంటి కాంగ్రెసువాదులు తెలుసుకోక కమ్యూనిస్టులపట్ల వారికున్న అక్కసుకొద్దీ వెంకటాద్రి స్టేటుమెంటునే బలపరుస్తూ ప్రచారంచేయడం జరుగుతోంది. ఇదీవైఖరి:

"కాంగ్రెసు సాంప్రదాయాన్ని కాపాడండి."

ఉప్పల లక్ష్మణరావుగారి ఉద్బోధ

బెజవాడ పట్టణ కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన సత్యనారాయణ పురం లైబ్రరీ సమీపంలో 22 వ తేది రాత్రి 8 గంటలకు బహిరంగసభ జరిగింది. డాక్టరు ఉప్పల లక్ష్మణరావుగారు అధ్యక్షత వహించారు.

తాను కమ్యూనిస్టుపార్టీ సభ్యుణ్ని కానని, ఇరవైఏళ్ళనుండి కాంగ్రెసు సభ్యుడుగావున్నానని అధ్యక్షులన్నారు. "మనజాతీయసాంప్రదాయంఏమంటే యితరరాజకీయపార్టీలుచెప్పినది సహనశీలతతోవిని వారిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం. నేటి రాజకీయాల్లో స్పర్థలూ సంఘర్షణలూ పెరిగిపోతూండడం వల్ల, సత్యాహింసలూ, వాక్స్వాతంత్ర్యాలూ మట్టిపాలవుతున్నాయి. గత ఎన్నికల్లో నెహ్రూగారు ప్రచారం చేస్తున్నప్పుడు బొబ్బిలిలో జమీందారీ మనుష్యులు అనేక అత్యాచారాలుచేసేరు. బొగయ్యగారి(గిరిగారి తండ్రి)కారునుపడగొట్టేరు. అపరిస్థితులేఈనాడుకూడకనిపిస్తున్నాయి. యిటువంటిఅక్రమాలు ఎవరు చేసినప్పటికీ తమ అనుచరులు చేస్తున్నప్పటికీ, ఖండించ వలసిన బాధ్యత మన నాయకులపై ఉంది. కమ్యూనిస్టుపార్టీకాంగ్రెసును నాశనం చేస్తానని యెన్నడూ అనలేదు. అట్టికార్యక్రమం దానికిలేదు."

తరువాత టి. వెంకటేశ్వరరావుగారు మాటాడుతున్నంతసేపు కాంగ్రెసు వలంటీరు లక్ష్మయ్య అనే వ్యక్తి (భార్యను ఖూనీచేసినందుకు యావజ్జీవ శిక్ష ననుభవించినవాడు) నిందాకరంగా కేకలువేస్తూ వచ్చాడు. ఇతనికి ఆ ప్రాంతంలోవున్న కాంగ్రెసు, హిందూ మహాసభ, ఆర్. ఎస్. ఎస్. సభ్యులూ, అభిమానులూ మద్దతుయిస్తూవచ్చారు.

పైన చెప్పిన లక్ష్మయ్య సభ ప్రారంభం కాకపూర్వమేవచ్చి, అక్కడ సభ పెట్టడానికి వీల్లేదంటూ బూతుకూతలతో అధిక ప్రసంగం చేసేడు. సభ పెట్టేటప్పుడు రోడ్లమీదా, గోనెపట్టాలమీదా పల్లేరు కాయలు జల్లబడ్డాయి.

ప్రకాశం కమిటీ రిపోర్టుతో జమీందారీపద్ధతి రద్దవుతుందా?

"రైతుల కనీసపు కోర్కెలను గురించి కమ్యూనిస్టుపార్టీవారు ఒక గ్రంధాన్ని ప్రకటించారు. ప్రకాశంగారి జమీందారీరిపోర్టులోని సూచనలకన్న కమ్యూనిస్టుల ఆగ్రంథం అనేక విధాల వెనుకబడివుంది." అని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకమిటీ కార్యదర్శి కళా వెంకటరావుగారుఒకఉపన్యాసంయిచ్చినట్లుగా 12-11-45 ఆంధ్రపత్రికలో ప్రకటితమైంది.

కమ్యూనిస్టుపార్టీ ప్రణాళికలో జమీందారీ విధానాన్ని గూర్చిన భాగం యిది:

"జమీందారీ పద్ధతి రద్దుకావాలి. భూమిని జాతీయ ప్రభుత్వమే స్వాధీనం చేసికోవాలి. దాలివాలని భూములతో వ్యవసాయం చేయటంవల్ల రైతుఅనేకకష్టాలకులోనవుతున్నాడు. గనుక, అలాంటి పేదరైతులందరికీ ఎక్కువ భూములు లభించేటట్లుగా అన్ని భూములనూ తిరిగి పంచాలి. అంతేగాక కో-ఆపరేటివ్ పద్ధతి ప్రకారం విశాలమైన భూఖండాలలో సేద్యం చేయడానికి వసతులేర్పర్చాలి."

(ప్రజాశక్తి 17-10-45)

ఇక, ప్రకాశంకమిటీ బిల్లులోని ప్రధాన సూచనలేమిటి:

1. జమీందారీలు మామూలుగానే ఉంటాయి. కాని భూమిపై శిస్తు చెల్లించునంత కాలం ఆభూమిపైహక్కు రైతుకేవుంటుంది. పర్మనెంటు సెటిల్మెంటునాడు రైతూ, జమీందారూ చేసుకున్న ఒడంబడిక షరతులన్నీ అమలు జరగాలి.

2. 1802 వ సంవత్సరమునకు పూర్వమున్న శిస్తులే న్యాయమైన శిస్తులుగా పరిగణించాలి. వీటికింక పెంచకూడదు.

3. ఇంక్లూడెడ్ ఈనాములకేగాని ఎక్స్‌క్లూడెడ్ ఈనాములకూ, దర్మిలా ఈనాములకూ ఈబిల్లు వర్తించదు.

4. జలాధారాల సంరక్షణ జమీందార్ల చేతులలోనే వుంటుంది.అవసరమైనచో,ప్రభుత్వమే జలాధారాలమరమ్మతులను గావించాలి.

5. అడవులు, వుంతలు, కొండలు మున్నగు పోరంబోకులలో రైతులకున్న స్వతస్సిద్ధమగు హక్కులు రక్షింపబడాలి.

6. కవులుదార్లకు ఈ చట్టంలో ఏలాంటి రక్షణలివ్వాలో చెప్పలేము.

7. సెలవులేని బంజరుసాగులపై రైతుల కెట్టి జిరాయితీహక్కు వుండదు.

8. రెమిషన్ల మాటయేలేదు. కరువులు వచ్చిన సమయంలోశిస్తువాయిదాలు యిప్పించబడును.

బిల్లుయొక్క ఉపోద్ఘాతంలో "భూమిపై రైతుకుగల జిరాయితీహక్కునూ, జమీందారుకున్న మేల్వారం హక్కునూ ప్రకటించుటకై" అని చెప్పబడింది. అంటే జమీందారీలు శాశ్వతంగా ఉండటమనేగా?

ఏమాత్రం బుద్ధిగల మనిషియైనా, జమీందారీపద్ధతి యొక్క దౌష్ట్యాన్ని ఏమాత్రం చవిచూచిన రైతయినా, కమ్యూనిస్టుపార్టీ ప్రణాళిక అభివృద్ధికరమో, లేక ప్రకాశం కమిటీ బిల్లో తేలికగా తెలిసికొనగల్గుతాడు. జమీందారీ విధానమును గూర్చిన ప్రణాళికలో కమ్యూనిస్టుపార్టీ కోరే రైతు అభ్యుదయమును, జమీందార్లను పరిరక్షించుటకై కాళ్ళు బలపాలుకట్టునట్లు తిరిగే కళావారేమి గుర్తించగలరు? 'జమీందారీ విధానం రద్దుకావాలి' అన్న కోర్కెయూ, జమీందారీపద్ధతి శాశ్వతంగావుండే శాసన పూర్వకమగు హక్కుల ప్రణాళికయూ, ఒకటేనా?

జమీందారీ విధానమంటే:

జమీందారీపద్ధతిలోని దౌర్జన్యాలను గూర్చిగాని, రైతులనుపీల్చిపిప్పిచేసేఏర్పాట్లనుగూర్చిగాని ప్రత్యేకంగా ఇప్పుడు చెప్పనవసరంలేదు. ప్రతి జమీన్‌రైతూ సులభంగా చెప్పగలడు. ఈపద్ధతి ఎందుకు రద్దుకావాలో. హెచ్చు శిస్తులబాధ, అక్రమశిస్తులబాధ, పోరంబోకులు, జలాధారములు మొదలైన వాటిలో జమీందార్లకు గల అధికారాలు - ఎన్నో వున్నాయి. వీటివిషయంలో రైతులనురక్షించుటకై అనేకప్రయత్నాలు గావించబడ్డాయి.కాని అవన్నీ నిరుపయోగమైనాయి. ఇప్పుడు ప్రకాశం కమిటీసూచనలు కూడా అంతకన్న ఎక్కువరక్షణలు కల్గిస్తాయన్న నమ్మకమేమీ లేదు. జమీందారీపద్ధతి రద్దుఅయితేనే, ఈ పీడలన్నీపోతాయి.

నండూరి ప్రసాదరావు

కాని ఇంతకన్న ముఖ్యమైనది రాజకీయ కారణం. ఆంధ్రసర్వస్వంలో చెప్పినట్లు, పన్నులు వసూలుచేయు ఏజంట్లు లేక కలెక్టర్లుగా మాత్రమే జమీందార్లను బ్రిటిషుప్రభుత్వం రైతుల తలపైకెక్కించలేదు. ఈ విధంగా శిస్తు వసూలుదార్లుగా మాత్రమే చెప్పటం రైతులకు కట్టుకథలు చెప్పి మోసగించడమే. బ్రిటీషుపరిపాలనకు తైనాతీగావుండే ఒక సాంఘికవ్యవస్థను ఏర్పర్చడమే జమీందారీ పద్ధతి నేర్పర్చటలో గల ముఖ్యోద్దేశం. బ్రిటీషు పెట్టుబడిదార్లు భారతదేశాన్ని జయించిన ప్రారంభదశలో తమ అధికారాన్ని సుస్థిరంగా నిలబెట్టుకుంటానికై భారతీయులలో తమకు మద్దతుయిచ్చే ఒకవర్గాన్ని సృష్టించదలచారు. ఆ వర్గంయొక్కబ్రతుకంతా బ్రిటీషు సామ్రాజ్యవాదులప్రసన్నతమీదనే ఆధారపడి వుంటుంది. కాబట్టి వీరంతా ప్రభుత్వం అడుగులకు మడుగులొత్తుతూ ఉంటారు. అందుకై వీరికి భూమిపై కొన్ని హక్కులు కల్గజేయబడ్డాయి. ఈవిధంగా బ్రిటీషు సామ్రాజ్యవాదం అనుసరించే వలసరాజ్యాంగ నీతిలో జమీందారీ విధాన మొక భాగమని స్పష్టం కాగలదు.

ఈ విషయాన్ని బ్రిటీషుపరిపాలకులే స్పష్టంగా తెలియజేశారు. జమీందారీపద్ధతి నేర్పర్చుటకు కారకుడైన లార్డు కార్న్‌వాలీసు, తానేర్పర్చే జమీందారీలకూ, పూర్వపు జమీందారీలకూ పోలికేలేదనీ,తానొకనూతనవర్గాన్ని సృష్టిస్తున్నట్లూ, వారికి భూమిలోఆస్తిహక్కులను సంక్రమింపజేయటం ప్రభుత్వక్షేమానికే అవసరమనీ, తెలియజేశాడు. 1828-35 వరకుగవర్నరుజనరల్‌గావున్నలార్డువిలియం బెంటిన్క్‌విప్లవాన్ని ఆపేవుద్దేశంతోనే జమీందారీపద్ధతిని ఏర్పరుప చేయబడిం దన్నాడు. "అనేకవిషయాలలో జమీందారీవ్యవస్థ నిరుపయోగమే. కాని దేశవ్యాపితమైన తిరుగుబాటును గాని ఆశాంతినిగాని అణచడంలో యిది చాల వుపయోగకరం. ప్రజలమీద పూర్తి పలుకుబడిగల ఈ ధనికజమీందారీ ప్రయోజనాలు బ్రిటీషుప్రభుత్వం నిలిచివుంటేనే రక్షించబడి వుంటాయి. అందుచేత ఈజమీందార్ల పటాలం అంతా ప్రజావిప్లవానికి అడ్డుకట్టగా వుపయోగపడుతుంది." అని ఈయన 8-11-1829 ఇచ్చినఉపన్యాసంలో ఒకభాగం.

బ్రిటీషు ప్రభుత్వానికి విశ్వాస పాత్రులైన సేవకులుగానే జమీందార్లు వ్యవహరించారు. రైతు ఉద్యమాన్నిగాని స్వాతంత్ర్యోద్యమాన్ని గాని నాశనం చేయడానికి వీరు పూర్తిగా కృషి చేశారు. బ్రిటీషు ప్రభుత్వమునకు పునాదులుగా పని జేశారు. కారణం, ఈ బ్రిటీషు ప్రభుత్వం ఉన్నంతకాలమే తమ బ్రతుకని వారు పూర్తిగా గుర్తించారు కాబట్టి. 1938 లో అఖిల భారత భూస్వాముల మహాసభకు అధ్యక్షత వహిస్తూ, మైమన్‌సింగు "మనం ఒకవర్గంగా నిలబడి వుండాలంటే ప్రభుత్వాన్ని బలపర్చట మేమనపది" అన్నాడు. 1937 ఎన్నికలలో ఈ జమీందార్లవైఖరివిజూస్తే జమీందారీ పద్ధతి ఏ విధంగా జాతీయోద్యమ వ్యతిరేకమైన సామ్రాజ్యవాద తైనాతీయో స్పష్టంకాగలదు. జమీందార్ల ఈ సేవకు ప్రతిఫలంగానే వారికి ప్రత్యేక నియోజకవర్గాలూ, రక్షణలూ, కేంద్ర రాష్ట్ర శాసన సభలు రెండింటిలోనూ కలుగ జేయబడ్డాయి.

రైతాంగం బాగుపడాలంటే

మన తలలపైకి ఎక్కించబడిన ఈ జమీందారీ పద్ధతి మనల నింతవరకూ కృంగదీస్తూ నచ్చింది. ఈ రెండో ప్రపంచయుద్ధకాలంలో ఈబరువు మరింత భారమై అనేక లక్షల రైతులు నాశనమైనారు, బెంగాల్ కరువుకు ప్రభుత్వం, దొంగవ్యాపారులూ, జమీందార్లే కారణమని ప్రతివారికి తెలిసినదే. ధాన్యంలో అధికభాగం వారిచేజిక్కటమే గాక, అనేక లక్షల ఎకరాలు శిస్తు బకాయీల క్రింద వారి చేతుల్లోకి పోయాయి. కాబట్టి భారత రైతాంగజీవితాన్ని పునర్నిర్మించే ప్రయత్నం జమీందారీ పద్ధతిని నిర్మూలించనిదె సఫలంకాదు. ఇంకా ఈ పద్ధతివుంటే, దాని చుట్టూ ఎన్ని ముళ్ల కంచెలు, ఎన్ని అడ్డు గోడలు నిర్మించినా ప్రయోజనంకాదు. కరువులు, కాటకాలు భూములను గోల్పోవటం హెచ్చవుతూనే వుంటుంది. కాబట్టి ఏ ప్రభుత్వమైనా ప్రప్రథమంగా చేయవలసినది జమీందారీ పద్ధతిని రద్దు చేయటం.

ప్రకాశం బిల్లులోని ప్రధాన విషయాలు

రైతు సౌభాగ్యం ఎట్లా కలుగుతుందా అనే దృక్పధాన్నుండి చూస్తే ప్రకాశంబిల్లు పూర్తిగా అభివృద్ధినిరోధకము; రైతాంగ శ్రేయస్సుకు వ్యతిరేకము. ఏ విధంగా?

1. జమీందారీ పద్ధతియొక్క శాశ్వతత్వానికి కాంగ్రెసు హామీ యివ్వటమేమిటి.

2. 1802 నాటి శిస్తులకు తాయపస్వటం వల్ల కూడా రైతులకు జరిగేదేమీలేదు. 1802 నాటికే ఈశిస్తులు అధికంగా వుండేవి. మొగల్ సామ్రాజ్యం పడిపోయిన అనంతరం కొత్తగా వచ్చిన ప్రభువు ప్రతివారూ శిస్తులు పెంచుతూ రావడం జరిగింది. ఈవిధంగా 1802 నాటికి ఈశిస్తులు దారుణంగా పెరిగి వున్నాయి ఉదా: 1784-85 లో మొగలుల ఏజంట్లు బెంగాలు రాష్ట్రంలో రు. 1,22,70,000 లు వసూలుచేస్తే, ఈస్టిండియా కంపెనీ పరిపాలన క్రిందకు రాగానే 1765-66లోనే దీనిని రు 2,20,50,000వరకు పెంచేశారు. 1793 లో జమీందారీ పద్ధతిని ప్రవేశపెట్టునాటికి ఈశిస్తులు రు. 4,69,65,000 లకు పెరిగింది అందుచే ఇప్పుడున్న శిస్తులు కొద్దిచోట్ల తగ్గిననూ, మొత్తంమీద రైతుకు పెద్దగా శిస్తుభారం ప్రకాశం బిల్లువలన తొలగదు.

ఈశిస్తులకుతోడు సెస్సులనీ, ఫీజులనీ, బీటిశిస్తులనీ అనేక రకాలని పూర్వం లేనివి రైతులపై పడ్డాయి. ఇవన్నీ కలసి మోపెడౌతున్నాయి. కాబట్టి 1802 నాటి శిస్తులుకూడా రైతుల భారాన్ని తీసివేయలేవు.

3. జలాధారాలు, అడవులు, కొండలు మొదలగు వాటిపై రైతుల సాంప్రదాయసిద్ధమగు హక్కులున్నా, పెత్తనం జమీందార్ల చేతులలోనే వుంటుంది.

4. ఈబిల్లు2800 ఈనాం గ్రామాల్రైతులకు వున్న జిరాయితీ హక్కును తొలగించి వేస్తుంది. ఈనాందార్ల దయా దక్షిణ్యాలపై ఈ రైతాంగం బ్రతకాలి ఈప్రకాశంబిల్లువస్తే.

5. అట్లాగే కౌలుదార్లగతి కూడా విడిచి పెట్టబడింది.

ప్రకాశంబిల్లు అసలుగుట్టు ఇది. ఇట్టి శాసనం కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమం కన్న అభివృద్ధిదాయకమని ఎవరైనా అనగలరా?

మేమిదివరలో ప్రకాశం బిల్లును ఎందుకు బలపర్చాం?

అయితే, ప్రకాశం బిల్లు ప్రకటింపబడ్డప్పుడు కూడా ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం బిల్లులోని లోపాలను ఎత్తిచూపుతూ, జనరల్‌గా బిల్లును బలపర్చింది. ఎందువల్ల?

రైతాంగం పూర్తిగా విముక్తి గావాలంటే జమీందారీపద్ధతి రద్దుకావాలన్న ప్రాథమిక కోర్కెను ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం ఏర్పడినప్పటినుండి వెల్లడిస్తూనే వచ్చింది. అయితే ప్రతి విశ్యమూ జమీందార్లవల్ల కల్గేనష్టాలనూ, వారు చేసే దౌర్జన్యాలనూ ఎదుర్కోవడానికి తోడ్పడే యే తాత్కాలిక శాసనాన్నయినా రైతుసంఘాలు బలపర్చుతూవచ్చాయి. రైతాంగము యొక్క సమస్యలను సమగ్రంగా పరిష్కరించగల శాసనం గాకపోయిననూ, అప్పటి రైతుఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి కొంతవరకు తోడ్పడుతుందనే దృష్టితో ప్రకాశం బిల్లును ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం బలపర్చింది. కాని యిప్పుడు రైతాంగ సమస్యలు అప్పటికంటె చాల క్లిష్టమయ్యాయి. రైతు ఉద్యమం అప్పటివలె ఇప్పుడుప్రాథమికదశలో (మిగతా 6వపేజీకి)

ముస్లింలీగ్‌ను మే మెందుకు బలపరుస్తున్నాం?

అంగలూరులో సుందరయ్యగారి విశదీకరణ

★

[కామ్రేడ్ సుందరయ్య యీనెల 18వ తేదీని జరిగిన అంగలూరు సభలో ఇచ్చిన ఉపన్యాసంలోని భాగాలను యీక్రింద ప్రకటిస్తున్నాం. సం.]

★

కాంగ్రెసు నాయకులు నేడు ముస్లింలీగు బ్రిటిషు ప్రభుత్వపు ఏజంటు అంటూ నిందిస్తున్నారు. అందుచే దానితో ఎట్టి సంప్రదింపులు అక్కరలేదంటున్నారు. దానిని విచ్ఛిన్నం చేయాలంటున్నారు. కాంగ్రెసు ముస్లింలీగుల చరిత్రను పరిశీలిస్తే, ఇది తప్పు అని రుజువవుతుంది.

కాంగ్రెసు 60 సంవత్సరాల క్రితం పుట్టింది. మొదటి రోజులలో కాంగ్రెసు నాయకులు భారతీయులకు పెద్ద ఉద్యోగాలివ్వాలని, దేశంలో పరిశ్రమలు స్థాపించాలని పిటీషన్లు పెట్టడంతోను, సంవత్సరానికొక పర్యాయం సమావేశమవడంతోను, సంతృప్తి పడేవారు. అదేరీతిగా ముస్లింలీగు 40 సంవత్సరాల క్రితం ఏర్పడింది. వెనుకబడిన ముస్లింప్రజలకు ప్రత్యేక విద్యాసౌకర్యాలు కావాలని, ఎక్కువ ఉద్యోగాలివ్వాలనీ, తమ తరపున శాసనసభలకు వెళ్లేవారిని తామేఎన్నుకోవాలనీ (అంటే తమకు ప్రత్యేక నియోజకవర్గాలు కావాలనీ) ఆందోళన చేసేవారు.

కాంగ్రెసు 1906 లో బ్రిటిషువారితో లాభంలేదని, బ్రిటిషు సామ్రాజ్యంలో ఒక భాగంగా ఉండే అధినివేశ స్వరాజ్యం (డొమినియను స్టేటసు) ఇవ్వాలని, కోరింది. లీగు కూడ 1912లో తనఆదర్శము డొమినియను స్టేటసు అని ప్రకటించింది.

1916 లో కాంగ్రెసు-ముస్లిం లీగులమధ్య లక్నోలో ఒకఒడంబడిక కుదిరింది. ముస్లింలు కోరుతూ వచ్చిన ప్రత్యేక నియోజకవర్గాలను కాంగ్రెసు అంగీకరించింది. కాంగ్రెసు - లీగులు కలసి దేశస్వాతంత్ర్యం కోసం పని చేయసాగాయి.

కాంగ్రెసు-లీగ్‌ల సంయుక్త సంఘటన

1919-22లలో గాంధి మహాత్ముని నాయకత్వం క్రింద, కాంగ్రెసు లీగులు కలసి ఖిలాఫతు - స్వరాజ్య ఉద్యమాలను నడిపాయి. మౌలానా మహమ్మదాలీ, షౌకతాలీలు, హజరత్ మోహినీ వగైరా ముస్లిం నాయకులు కాంగ్రెసులో చేరి పనిచేస్తూ వచ్చారు. మన జాతీయ ఉద్యమ చరిత్రలో మొదటి పర్యాయం స్వరాజ్యం కోసం పట్టణాలలో చదువుకొన్నవారేగాక గ్రామ ప్రజలు కూడా లక్షలకొలది పాల్గొనాలనే వినాదంతో ముందుకు నడిచాం. హిందూ ముస్లిం ఐక్యతవల్లనే స్వాతంత్ర్యం వస్తుందని దేశమంతటా హిందు ముస్లిం ప్రజాసామాన్యమంతటిలో చైతన్యాన్ని ప్రజ్వరింపచేశాం.

ఆరోజులు గడిచాయి. బ్రిటిషు ప్రభుత్వం హిందూ ముస్లిం దెబ్బలాటలను రెచ్చగొట్టుతూ వచ్చింది. అయినా 1927లో సైమను కమీషను మనదేశానికి వచ్చినపుడు కాంగ్రెసు-లీగులు రెండూకలిసి దానిని బహిష్కరించాయి. బ్రహ్మాండమైన నిరసన సభలు, సమ్మెలు చేశాయి.

అప్పుడే ఇద్దరూ కలసి, మన దేశానికి ఎట్టి రాజ్యాంగం కావాలో అఖిలపక్ష సమావేశంలో చర్చించారు. రాష్ట్రాలకే సర్వాధికారాలు ఉండాలనీ, రాష్ట్రాలు అంగీకరించి ఇచ్చిన అధికారాలు మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి ఉండాలనీ ముస్లింలీగు పట్టుబట్టింది. దానికి కారణం, బెంగాలు, పంజాబు, సింధు, సరిహద్దు, బెలూచిస్తాన్, రాష్ట్రాలలో ముస్లిములు ఎక్కువమంది ఉన్నారు. అందుచే రాష్ట్రాలకే సర్వాధికారాలుంటే, ఆరాష్ట్రాలలో తమ ముస్లిం ప్రజలకెక్కువ స్వాతంత్ర్యం, ఎక్కువహక్కులూ,ఉంటాయని ముస్లింలీగు నమ్మకం. కాంగ్రెసు దానికి ఆనాడు అంగీకరించలేదు. [1942 లో ముస్లింలీగు ముస్లిం ప్రజలసంపూర్ణ స్వాతంత్ర్య హక్కును(పాకిస్తాన్)కోరినప్పుడు 1927 నాటి అపరిమిత కోర్కెను 25 సంవత్సరాలు అలస్యమయిన పిదప, అంగీకరిస్తానని, తీర్మానం చేసింది. కాంగ్రెసు]

అందుచే ఆనాడు ఒడంబడికకు రాలేక పోయారు. ఆకారణంచేతనే 1930-32 ఉద్యమంలో ముస్లింలు ఎక్కువమంది పాల్గొనకుండా దూరంగా ఉండిపోయారు.

1931 లో రౌండు టేబుల్ సమావేశకాలంలో లండనులో తిరిగి కలసి చర్చించారు. కాని తిరిగి ఒడంబడికకు రాలేక పోయారు. 1937 ఎన్నికలలో లీగు అభ్యర్థులను కాంగ్రెసు బలపర్చింది. మంత్రివర్గాలు ఏర్పరచేటప్పుడు సంయుక్త మంత్రివర్గాలను కాంగ్రెసు లీగు మంత్రివర్గాలను ఏర్పరచాలని లీగు కోరింది. కాని కాంగ్రెసు అంగీకరించలేదు.

రోజురోజుకూ దూరం

ఈరకంగా కాంగ్రెసు - లీగులు రోజురోజుకు మరింత దూరమవుతూ వచ్చాయి.

1924 లో కాంగ్రెసు సంపూర్ణ స్వాతంత్ర్యం తన ఆశయమని ప్రకటించింది. లీగు కూడ 1937 లో తన ఆశయాన్ని సంపూర్ణ స్వాతంత్ర్యంగా ప్రకటించింది. సంపూర్ణ స్వాతంత్ర్యమంటే, యుక్తవయస్సు వచ్చిన ప్రజలందరూ వోటు యిచ్చి ఎన్నుకొనిన ప్రతినిధుల సభ—కాన్‌స్టిట్యుయంటు అసెంబ్లీ—భారత దేశానికి ప్రజారాజ్యాన్ని ఏర్పరచాలని కాంగ్రెసుప్రకటించింది. ఇలాంటిప్రజారాజ్యంలో రైతు కూలీల కోర్కెలు నెరవేర్చబడతాయని పౌరసత్వహక్కులు కాపాడబడతాయని హామీ యిచ్చింది. అదేరీతిగా ముస్లింలీగు 1940 లో ముస్లింలు అత్యధిక సంఖ్యాకులుగా నివసించే ప్రదేశాలలో, అచ్చటి ప్రజలు తమ భవిష్య ద్రాజ్యాంగాన్ని తామే నిర్ణయించుకొనే హక్కు ఉండాలని కోరింది. దానినే పాకిస్థానన్నది. పాకిస్థానులోని ప్రజలు ఏ మతానికిచెందినా, ఓటుహక్కుంటుందని, కాన్‌స్టిట్యుయంటు అసెంబ్లీద్వారానే ప్రజారాజ్యం ఏర్పరచుకుంటామని, లీగు నాయకులు ప్రకటిస్తున్నారు. మిగిలిన హిందుస్థాన్‌తో స్నేహంగా ఉంటామనీ ఇతర దేశస్థులు, ముస్లిం మతానికి చెందినవారయినాసరే, భారతదేశంమీదికి దండెత్తి రానివ్వమనీ. దండెత్తివస్తే వారిని ఎదుర్కొడానికి హిందూస్థాన్ సహాయం తీసుకుంటామని ప్రకటిస్తున్నారు. హిందూస్థాన్‌తో ఎట్టిసంబంధా లుండవలసినదీ, తమ భవిష్యద్రాజ్యాంగం ఎటువంటిదై ఉండాలి అని నిర్ణయించుకొనే హక్కు తమకే ఉండాలని కోరుతున్నారు.

ఈ చరిత్రమచూస్తే మనకు తేలేవిషయాలు రెండు:

కాంగ్రెసుప్రజలలోకి అంతకంతకు చొచ్చుకపోయేకొద్దీ, ప్రజలలో చైతన్యం హెచ్చేకొద్దీ, తనస్వాతంత్ర్యకార్యక్రమాన్ని తీవ్రతరంచేస్తూ ప్రజారాజ్యంకోసం ఎలా పనిచేయసాగిందో, అదేవిధంగా ముస్లింలీగు ముస్లిం ప్రజలలో చైతన్యం హెచ్చేకొద్దీ, ముస్లింప్రజలలో చొచ్చుకపోయేకొద్దీ, ముస్లింప్రజల న్యాయమైన హక్కులకోసం, వారి సంపూర్ణస్వాతంత్ర్యహక్కుకోసం, వారి పాకిస్థాన్‌హక్కుకోసం, పనిచేస్తూంది. కాంగ్రెసు, ముస్లిం లీగులు రెండూ బ్రిటీషుప్రభుత్వాన్ని తొలగించాలంటున్నాయి. భారతదేశానికి ప్రజారాజ్యం కావాలన్నా, ముస్లింప్రజలు అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న ప్రదేశాలలో వాళ్లకు పాకిస్థాన్ రావాలన్నా, బ్రిటిషుప్రభుత్వం పోవాలి. దానికోసం కాంగ్రెసు - లీగులు రెండూ కలసి పనిచేయాలి. ఇదివరకు కాంగ్రెసు-లీగులు రెండూ కలసి పనిచేశాయి కొన్ని సందర్భాలలో కలసి పనిచేయడానికి అనేక పర్యాయాలు ఒడంబడికకోసం సంప్రదింపులు జరిపాయి.

ముస్లింలీగు బ్రిటిషు ప్రభుత్వపు ఏజంటే అయితే, కాంగ్రెసు గత 40 సంవత్సరాలుగ ముస్లిం లీగుతో సంప్రదింపులు జరిపేదికాదు. అది స్వాతంత్ర్యాన్నికోరే సంస్థ కాబట్టే ఈ సంప్రదింపులన్నీ జరిగాయి. 1920 లో ఖిలాఫతు ఉద్యమంలో పాల్గొన్న అత్యధిక ముస్లిం నాయకులు నేడు ముస్లింలీగులో చేరి పనిచేస్తున్నారు. గాంధీమహాత్ముడే, ముస్లింలీగు ముస్లింప్రజలలోని అత్యధిక సంఖ్యాకుల సంస్థ అని అంగీకరించారు. అట్టిదో ముస్లింలీగును బ్రిటిషు ప్రభుత్వపు ఏజెంటు అని నేడు కాంగ్రెసునాయకులు, దూషించడం అపహాస్యం తప్ప మరేమీకాదు. అత్యధికముస్లిం ప్రజల సంఘాన్ని విచ్ఛిన్నం గావించడానికి పూనుకోవడం దేశానికి స్వాతంత్ర్యం తెచ్చే మార్గంకాదు. అంతర్యుద్ధానికి దారితీయడమే అవుతుంది.

ముస్లింలీగు కాంగ్రెసువలె సత్యాగ్రహోద్యమాలను నడుపలేదు. కాబట్టి అది స్వాతంత్ర్యసంస్థ కాదని కొంతమంది కాంగ్రెసు నాయకులు ప్రచారం చేస్తున్నారు. ముస్లిం ప్రజల హక్కులకోసం అనేక ఉద్యమాలలో పనిచేసిన ముస్లిం లెంతమందో నేడు లీగులో ఉన్నారు. అట్టి త్యాగధనులతో కూడిన ముస్లింలీగు దేశభక్త సంస్థకాక మరేమిటవుతుంది? అంతేగాక కాంగ్రెసువలె సత్యాగ్రహ పోరాటాలను నడుపనంత మాత్రాన ఒక సంస్థ దేశభక్తసంస్థ కాకుండాపోదు. కాంగ్రెసు 1920 కి ముందు ఎట్టి పోరాటాన్ని నడుపలేదు. అంతమాత్రాన కాంగ్రెసు 1920కి ముందు బ్రిటిషు ప్రభుత్వపు ఏజెంటు అని ఎవరైనా అంటారా?

పాకిస్తాన్ ముస్లింజాతుల న్యాయమైన హక్కు

ఈరోజున కాంగ్రెసు నాయకులు ముస్లింలీగును దూషిస్తూఉన్నట్లే ముస్లింలీగు నాయకత్వంకూడ కాంగ్రెసును దుమ్మెత్తిపోస్తోంది. ముస్లింలీగులోకూడ కాంగ్రెసులో లాగనే, జమీందారుల, భూస్వాముల, ధనికుల ప్రాబల్యం ఉంది. కాంగ్రెసులో లాగనే ప్రజాతంత్ర శక్తులు అభివృద్ధికాకుండా అనేక అటంకాలు ముస్లింలీగులో కూడ ఉన్నాయి. కమ్యూనిస్టులు ముస్లింలీగును బలపర్చడానికి కారణం ముస్లింలీగు కాంగ్రెసుకన్న అభివృద్ధికర సంస్థ అని కాదు. ఒక దానికంటె మరొకటి మెరుగని పోల్చడంవల్ల నేడెట్టి ప్రయోజనం లేదు. రెండూ దేశభక్తసంస్థలే. రెండూ కలిసిపనిచేస్తేనే,స్వాతంత్ర్యం సంపాదించగలమనే దృఢ విశ్వాసం మాది. అందుచేతనే రెంటిలోని లోపాలను కమ్యూనిస్టులము ఎత్తిచూపుతున్నాము. రెండు సంస్థలలోని న్యాయమైన హక్కులను బలపరుస్తున్నాం. రెండూ కలసిపనిచేయడానికి కృషిచేస్తున్నాం.

పాకిస్థాన్ వినాదం భరతఖండాన్ని ముక్కలు ముక్కలుగా చేయడానికే పనికివస్తుందని అది న్యాయమైన హక్కుగాదనీ కాంగ్రెసు నాయకులు వాదిస్తున్నారు. భారతదేశమంతా ఒకటే, భారత ప్రజలందరూ ఒకేజాతి - అని వారు వాదిస్తారు. బ్రిటిషుప్రభుత్వానికి వ్యతిరేకంగా మనమంతా ఒకటేకాని మరే దృష్టిలోను మనమంతా ఏకజాతి అనడం అసందర్భం.

మన కోరికలాంటిదే

ఉదాహరణకు చూడండి: తెలుగువాళ్లు, అరవవాళ్ళు ఒకే జాతి అంటే, ఎలా సరిపోతుంది? వాళ్ళలోను, మనలోను, అత్యధిక సంఖ్యాకులు హిందూ మతానికి చెందిన వాళ్ళమే. భారత రామాయణాలు చదువుతాము. ఒకే పండగలు, తీర్థాలు, దేవాలయాలు సేవిస్తాం. ఇంకా అనేక విషయాలలో, ఎన్నో సాంప్రదాయాలలో అరవవాళ్లూ మనమూ ఒకటే. ఇన్ని(మిగతా 5వ పేజీలో)

(మిగతా 5వ పేజీలో)

శ్రీ ధర్మవరం కృష్ణమాచార్యులు గురజాడ అప్పారావుగార్ల వర్ధంతి

నవంబర్ 30 వ తేదీన

ఆంధ్రదేశమంతటా నవ్యసాహిత్య పరిషత్పత్యులు, అభ్యుదయ రచయితలు ప్రజా నాట్యమండలి సభ్యులూ కలిసి, నవంబరు 30 వ తేదీన శ్రీ ధర్మవరం కృష్ణమాచార్యులు, గురజాడ అప్పారావుగార్ల వర్ధంతిని ఘనప్రదంగా జరుపగోరుతూ శ్రీ తెలికిచర్ల వెంకటరత్నం, తుమ్మల వెంకట్రామయ్య, దాశరథి రాజారావుగార్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐక్యభరతఖండ ★ ★ నిర్మాణానికి మార్గం

(4వ పేజీ తరువాయి) విషయాలలో ఒకటే అయినా, మనం వేరేజాతి అనుకుంటాం. మనం తెలుగువాళ్ళమనీ, మనది తెలుగు దేశం అనీ. మనతెలుగురాజ్యం ప్రత్యేకంగా ఉండాలనీ, అంటున్నాం. మద్రాసు రాష్ట్రంలో ఒక భాగంగా మనం ఉండకూడదు. అరవవాళ్ళతో కలసిఒకేరాష్ట్రంలోఉండకూడదు. మనతెలుగు వాళ్ళందరమూ కలిసి - నైజాం తెలింగానాలో ఉన్నా అందరమూ కలిసి - సాధ్యమైనంత త్వరలో ఒక ప్రత్యేక తెలుగుదేశంగా, ఒక తెలుగు రాజ్యంగా ఏర్పడా లనుకుంటున్నాం. మన పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవడం మన పదులకు ఆనకట్టలు, మన వ్యవసాయాభివృద్ధి, మన విశ్వవిద్యాలయములను పెంపొందించుకోవడం - ఇది మన రాజ్యము మనకుంటేనే, మనభవిష్యత్తు నిర్ణయించుకొనే హక్కు మనకుంటేనే, సాధ్యమవుతాయని అంటున్నాం. మన భవిష్యత్తును 18 సంవత్సరములు దాటిన తెలుగు ప్రజలంతా ఎన్నుకొనిన కాన్‌స్టిట్యుయంట్ అసెంబ్లీ [ప్రజా పరిషత్తు] నిర్ణయించాలంటే కాదని ఎవరంటారు? అయితే, మనమంతా భరతఖండంలో ఒక భాగంగాఉంటేనే మనకుమంచిదనుకుంటున్నాం. అందుచే కలసిఉండామనుకొంటున్నాం. అరవరాష్ట్రంలో కలసిఉండడానికి ఇష్టంలేదు కాబట్టి, వేరుగ ఉండాలంటున్నాం.

వివిధ జాతులకు స్వేచ్ఛ

ఇదేరీతిగ, మన భరత ఖండంలో అరవజాతి, తెలుగుజాతి వాళ్ళమేగాక, మలయాళీలు, కర్నాటకులు, మహారాష్ట్రులు, గుజరాతీలు, రాజపుతానీ, హిందుస్తానీ, బీహారీ, అస్సామీ, ఉత్కళ జాతులు, పడమటి పంజాబీ ముస్లింలు; తూర్పు పంజాబీ సిక్కులు, సింధు, బెలూచీ, కాశ్మీర్ జాతులు సరిహద్దురాష్ట్రంలో పఠాన్‌జాతి, పడమటి బెంగాలీ హిందువులు, తూర్పుబెంగాలీ ముస్లిములు-ఉన్నారు. వీరందరికి తమభవిష్యత్తును తామేనిర్ణయించుకొనే హక్కునుకమ్యూనిస్టు పార్టీ కోరుతూంది. అప్పుడే స్వేచ్ఛగ ఈస్వతంత్ర జాతులన్నీ భారతసమాఖ్యలో చేరడానికి ఎక్కువ అవకాశముంది. ఒకజాతిని మరొక జాతి నిర్బంధించడంవల్ల కాదు ఐక్య భరతఖండం వచ్చేది. తమంతట తామే ఎట్టి ఒత్తిడి లేకుండా, స్వేచ్ఛగా నిర్ణయించికొనినప్పుడే ఐక్య భరతఖండం బలిష్ఠరాజ్యంగా ఏర్పడగలదు. అందుచేతనే కమ్యూనిస్టుపార్టీ ముస్లింజాతులయినపఠాన్(సరిహద్దు),కాశ్మీరీ, బెలూచీ,సింధీ,పడమటిపంజాబీ ముస్లింలుతమ ప్రత్యేకప్రజాపరిషత్తుల (కాన్‌స్టిట్యుయంటు అసెంబ్లీల)ద్వారా తమ పాకిస్థాన్ రాజ్యాన్ని యేర్పరచుకోడానికి హక్కుఉందని గుర్తించమంటున్నాం. అదేరీతిగ పడమటి బెంగాలీ హిందువులు, తూర్పు బెంగాలీ ముస్లిములు వారికివేరువేరుకాన్‌స్టిట్యుయంటుఅసెంబ్లీలు ఉండాలోలేకఒకేకాన్‌స్టిట్యుయంటుఅసెంబ్లీ ఉండాలో వేరువేరుగా ఓటుచేసి నిర్ణయించుకోమంటున్నాం. ఈలాంటి హక్కు అచ్చటి ప్రజల న్యాయమైన జన్మహక్కు. దానిని మనంగుర్తించినప్పుడే అచ్చటి ముస్లింప్రజలు అనుమానాలు విడిచిపెట్టి భరతఖండంలో కలసి ఉండడానికి ముందుకు వస్తారు.

ముస్లింలీగు నాయకులు కొంతమంది కోరినట్లు అస్సాం, తూర్పు పంజాబు, పడమటి బెంగాలులను కూడ పాకిస్తాన్‌తో కలిపివేయాలనే కోర్కెను కమ్యూనిస్టుపార్టీఒప్పుకోవడం లేదు. పాకిస్తానులో అవి ఉండడమా లేదా అనేది అచ్చటిప్రజలు స్వేచ్ఛగా నిర్ణయించుకోవాలేగాని, ముస్లింలీగు కోరినంతమాత్రాన ముస్లిం ప్రజలు అల్పసంఖ్యాకులుగా ఉన్న ఈ ప్రాంతాలను పాకిస్తాన్ భాగాలుగా ఎవరూ అంగీకరించరని స్పష్టంచేసింది.

కాంగ్రెసు నాయకుల ధోరణి

కాంగ్రెసు నాయకులు, ముస్లిం ప్రజల న్యాయమయిన హక్కును కూడ అంగీకరించడంలేదు. గాంధి మహాత్ముడు అంగీకరించిన దానిని గూడ కాంగ్రెసు వర్కింగు కమిటీ తోసివేసింది. గాంధీ మహాత్ముడు కొన్ని షరతులతో ముస్లిములు అత్యధిక సంఖ్యాకులుగా నివసించే ప్రదేశాలలో వారు స్వతంత్ర రాజ్యాలుగ ఏర్పడడానికి, భరతఖండాన్నుండి విడిపోవడానికి కూడ హక్కు ఉన్నదని అంగీకరించారు. ఆ షరతులను జిన్నానిరాకరించారు.నేడుకాంగ్రెసువర్కింగు కమిటీ మరింత వెనక్కిపోయింది. అసలు భరతఖండాన్నుండి ఏ రాష్ట్రం విడిపోవడానికి తాము ఒప్పుకోమని, తమ సర్వశక్తులను వినియోగించి వ్యతిరేకిస్తామని ప్రకటించారు. జగల్‌నారాయణలాల్ తీర్మానాన్ని పునరుద్ఘాటించారు. పాకిస్తానును వ్యతిరేకిస్తాము, ముస్లింలీగుతో రాయబారాలేమీ జరుగవు అన్నారు.

ఇన్ని చేసినా, ఏదైనా రాష్ట్రం విడిపోవడానికి తయారయితే, అప్పుడు బలాన్ని ఉపయోగించమని కాంగ్రెసునాయకులు ప్రకటించారు. ఈరోజుసమస్య కాంగ్రెసు సైనిక బలాన్ని ఉపయోగించి పాకిస్తాన్ హక్కును ఎదుర్కోవడమా, ఎదుర్కోక పోవడమా? కాదు. ఈరోజు సమస్య బ్రిటిషు ప్రభుత్వపు పిడికిలినుండి ఏరీతిగ మన ప్రజారాజ్యాన్ని, ముస్లింల పాకిస్తాన్ ప్రజారాజ్యాన్ని, సాధించడం అనేదేకాంగ్రెసు లీగుల నేటిపని. ఒకరి హక్కులను మరొకరివద్దనుండిసాధించడానికి ఇద్దరివద్దా సైన్యాలులేవు. రెండూ కలసి తమ హక్కులను బ్రిటిషు ప్రభుత్వంనుండి సాధించాలి. అందుచేతనే కాంగ్రెసు ముస్లింప్రజల న్యాయమైన పాకిస్తాన్ హక్కును గుర్తించాలని కమ్యూనిస్టుల మంటున్నాం.

ఎన్నికలలో

కమ్యూనిస్టు అభ్యర్థులు లేనిచోట, ముస్లిం స్థానాలలో ముస్లిం అభ్యర్థులను కమ్యూనిస్టు పార్టీ నేడు బలపర్చుతూంది. కాంగ్రెసు ముస్లిములు ఎన్నిత్యాగాలు చేసినా, వ్యక్తిగతంగా వారు ఎంత మంచివారైనా, నేడువారు ముస్లిం ప్రజల న్యాయమైన కోర్కెను బలపర్చడం లేదు. కాబట్టివారిని కమ్యూనిస్టుపార్టీ బలపరచదు. ముస్లింలీగును విచ్ఛిన్నం చేయాలని కాంగ్రెసు ముస్లింలు కృషిచేస్తున్నారు కాబట్టి, కమ్యూనిస్టుపార్టీ వారిని బలపరచదు.

కాంగ్రెసు ముస్లింలీగును విచ్ఛిన్నం చేయాలని, పంజాబు యూనియనిస్టు మంత్రివర్గంతో చేతులు కలుపుతూ ఉంది. ఏఖిజర్ హయ్యత్‌ఖాన్ గదర్‌పార్టీ వీరులను, భగత్‌సింగు అనుచరులను, పందలకొలది దేశభక్తులను లాహోరు కోటలో, పంజాబు జెయిళ్ళలో, యమయాతనలు పెట్టుతున్నాడో, అట్టి ఖిజర్‌తో, ఆజాద్ రహస్య సంప్రదింపులు చేస్తున్నాడు. జిన్నా, ముస్లింలీగు పాకిస్థాన్‌లో ప్రజారాజ్యం కావాలంటున్నారు. అది పనికి రాదు; ముస్లిం మతరాజ్యం కావాలనే అహరారులను పెద్ద జాతీయవాదులుగ కాంగ్రెసు నాయకులు పొగడుతున్నారు. ఇదంతా ముస్లిం లీగును విచ్ఛిన్నం చేయాలనే ఆదుర్దాతో చేసే పనులు తప్ప మరేమీకావు.

కాంగ్రెసు - లీగుల ఐక్యత రాకపోతే —

1942 లో క్రిప్సు రాయబారాలు జ్ఞాపకం చేసుకోండి. ముస్లింలీగును నిర్లక్ష్యంచేసి, కాంగ్రెసు ఒక్కటే క్రిప్పుతో రాయబారాలు నగిపింది ఫలితం, క్రిప్సు మొండి చేతులు చూపి తన ప్రజలముందు కాంగ్రెసు లీగులు కలసిరాలేదు కాబట్టి తన తప్పేమీలేదంటూ సమర్థించుకోగలిగాడు.

1942 అగష్టులో మరల కాంగ్రెసు-లీగు ఐక్యతకోసం ప్రయత్నించక, పోరాటమనే తీర్మానంచేయడంతో బ్రిటిషు ప్రభుత్వం మనపై దెబ్బగొట్టగలిగింది. తన అడ్వైజర్ల ప్రభుత్వంతో, లంచగొండి ఉద్యోగస్థులతో, దొంగవ్యాపారుల, తిండిదొంగల రాజ్యం దేశంలో సాగించింది. కరువుకాటకాలలో, అంటువ్యాధులలో మన ప్రజలు అనేకఇక్కట్లు పడ్డారు.

సిమ్లాసమావేశంలో 1944 లో కాంగ్రెసు లీగులు కలసి, కేంద్రంలో ఐక్యమంత్రివర్గం ఏర్పాటు చేయలేకపోతే, వేవెల్ యిద్దరికీ మొండిచేయి చూపించాడు. తన ప్రభుత్వాన్ని సాగిస్తున్నాడు. భారత సైన్యాలను ఇండోనేషియా, ఇండోచైనా ప్రజల స్వాతంత్ర్యాన్ని అణచడానికి ఉపయోగిస్తున్నాడు. మన పార్టీలన్నీ ఎంతఆందోళన చేస్తున్నప్పటికి లెక్కచేయక, అజాద్ హింద్‌ఫౌజ్ సైనికులపై కేసులునడుపుతున్నాడు.పోలీసుఉద్యోగస్థులు, నిజామహాయ్యతుఖాను లాంటి ద్రోహకముల అన్యాయాలతో ఎన్నికలు జరుపబోతున్నారు.

ఈ ఎన్నికలలో మనం కలిసిపనిచేయకపోతుంటేదు, ఎన్నికల తరవాతగూడ కాంగ్రెసు లీగుల కలసిరాకపోతే ఒకే కాన్‌స్టిట్యుయంటు అసెంబ్లీ అనీ, ముస్లింలీగు ముస్లిం ప్రాంతాలకు ప్రత్యేక కాన్‌స్టిట్యుయంటు అసెంబ్లీ అన్నీ కలసిరాకపోతే, యుక్తవయస్సువచ్చిన ప్రజలందరూ ఎన్నుకొన్న కాన్‌స్టిట్యుయంటు అసెంబ్లీలు కావు మన భవిష్యత్తును నిర్ణయించేది. బ్రిటిషు సామ్రాజ్యవాదులు మన భవిష్యత్తును నిర్ణయిస్తారు. వారు తయారుచేసి పెట్టుకున్న కూప్లాండు ప్లానును మనమీదరుద్దుతారు. ఈప్లానుప్రకారం పంజాబు (అంబాలా డివిజను తప్ప), సరిహద్దురాష్ట్రం, బెలూచిస్థాన్, సింధు, వీటిని ఒక డొమినియనుగా ఏర్పాటుచేస్తారు. బెంగాలు, అస్సాములను మరొక డొమినియనుగా యేర్పాటుచేస్తారు. మిగిలిన రాష్ట్రాలను హిందుస్తాన్ డొమినియనుగా యేర్పాటుచేస్తారు. స్వదేశ సంస్థానాలన్నింటినీ మరోక డొమినియనుగా చేస్తారు. ఈ నాల్గు డొమినియనులను నడపడానికి ఢిల్లీ కేంద్ర ప్రభుత్వాన్ని తమ చేతులలో బ్రిటిషు సామ్రాజ్యవాదులు ఉంచుకుంటారు తమ సైన్యాలను స్వదేశ సంస్థానాలలోవుంచి ఈ వివిధ డొమినియనుల హక్కులను తొక్కిపెడతారు. మనలోమనం దెబ్బలాడుకుంటూ బ్రిటిషుప్రభుత్వాన్ని, దాని తోహకుం సంస్థానాధీశులను, జమీందారులను ఎల్లకాలం దేశంలోఉండనిచ్చినవాళ్లమవుతాము. మన ప్రజలకష్టాలను వేటినీ తీర్చలేము. మన వ్యవసాయాన్ని, పరిశ్రమలను అభివృద్ధి చేసుకోలేము ముక్కలు ముక్కలుగా విడదీయబడిన మనతెలుగుజాతిని ఒకేదేశంలో ఒకరాజ్యంగా ఏర్పరచలేము. అందుచేతనే స్వతంత్ర అంధ్ర జాతిగా జీవించాలంటే విశాలాంధ్రావనిని ఒకే రాజ్యంగా ఏర్పరచాలంటే, ముస్లిముజాతుల న్యాయమైన పాకిస్తాను హక్కును కాంగ్రెసుచే గుర్తింపచేయాలి.

అందుచే కాంగ్రెసు - లీగు - కమ్యూనిస్టు ఐక్యతకోసం, సత్వర సంపూర్ణ స్వాతంత్ర్య సంపాదనకోసం కమ్యూనిస్టుపార్టీకే ఓటు నివ్వండి.

నెల్లూరు — ఆత్మకూరు నియోజకవర్గానికి కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థి దువ్వూరి బలరామరెడ్డిగారు

1928 సం॥ నుండి పల్లిపాడు ఆశ్రమంనిర్వహిస్తూ 1930 సం॥లో కాంగ్రెసుచే నడుపబడిన ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని, రెండుసార్లు జైలుశిక్ష ననుభవించారు. మైపాడు ఉప్పుసత్యాగ్రహ శిబిరానికి నాయకత్వం వహించారు.

1933 సం॥లో బాంబులు తయారుచేయబోతున్నారనే నేరంక్రింద మద్రాసు కుట్ర కేసులో 3½ సం॥ శిక్ష అనుభవించారు. నెల్లూరుజిల్లా కాంగ్రెసుకమిటీ ప్రధాన కార్యదర్శిగా, జిల్లాకాంగ్రెసు పార్లమెంటరీబోర్డు కార్యదర్శిగా వున్నారు. కాంగ్రెసు తరపున నియమింపబడిన నెల్లూరు జిల్లాబోర్డు సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. 1939లోజిల్లా రైతుసంఘ కార్యవర్గసభ్యులుగాను, గత రెండుసంవత్సరములనుండి జిల్లారైతుసంఘ అధ్యక్షులుగాను రైతులకు సేవ చేస్తున్నారు.

1941 సం॥ లో రహస్య కరపత్రాలున్నాయనే నేరంక్రింద శిక్షింపబడ్డారు.

శ్రీ దువ్వూరు బలరామరెడ్డిగారు 1937నుండి పార్టీతో కలిసి పనిచేస్తూ వచ్చారు. పార్టీకార్యక్రమం అంగీకరించి, పార్టీ శిక్షణ ననుసరించి పనిచేయడానికి తయారయిన పార్టీసానుభూతిపరులు. వీరు రాబోవు రాష్ట్రఅసెంబ్లీ ఎన్నికలలో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థిగా నిలబడుతున్నారు.

రైల్వేకార్మికుల పోరాటం ప్రజలపోరాటమే

ప్రజలు పూర్తిగా తోడ్పడాలి

ప్రభుత్వం రైల్వేకార్మికులను పనుల్లో నుంచి తీసివేయనవసరం లేకుండానే మిలిటరీనుంచి వచ్చువారికికూడా పనులను చూపించేనిమిత్తం రైల్వేమన్ ఫెడరేషన్ 16 సూచనలను చేసింది వాటిని వెంటనే అమలు పర్చాలని ప్రభుత్వాన్ని కోరింది. మొత్తం యీ 16 సూచనలయొక్క ప్రధాన వుద్దేశం, రైల్వే పరిశ్రమను దేశమంతటా అభివృద్ధి పర్చటం యిప్పుడు పనుల్లోవున్న రైల్వేపనివారినందరినీ అలాగేవుంచి యింకా యెంతమంది ప్రజాసామాన్యానికైనా రైల్వేలలో వుద్యోగాలను కల్పించటం. వీటిల్లో కొన్ని కార్మికుల కోర్కెలను తీర్చేవి. మరికొన్ని ప్రజల అవసరాలను తీర్చేవి. ప్రజల అవసరాలను తీర్చే విషయంలో చేయబడిన సూచనలివి :

1. ప్రయాణీకులకు స్నానవసతి; నిద్రపోడానికి తగినవసతి; పంకాల యేర్పాటుతో కూడుకొని యుండునట్లుగా మూడవ తరగతి పెట్టెలను పునర్నిర్మించవలెను.

2. యుద్ధకాలంలో తీసివేసిన రైల్వేలైనులను తిరిగి వేయాలి. ఆపివేసిన ట్రైన్ సర్వీసులను తిరిగి ప్రారంభించాలి. ట్రైన్ సర్వీసులను ప్రజల అవసరాలనుబట్టి ఇంకా యెక్కువ చేయవలెను.

3. దేశ అవసరాలకు తగినట్టుగా కొత్త రైల్వే లైన్లను నిర్మించాలి.

4. రైల్వేలను నిర్మించటానికి వీల్లేనటువంటిదూరపు ప్రదేశాలకుగ్రామాలకు రైల్వే మోటారు ట్రాన్సుపోర్టును ప్రవేశపెట్టాలి.

5. ప్రస్తుతం రైల్వేల అధీనంలో వున్న మన రాయల్ విమాన దళ వర్కుషాపులను, ప్రజల అవసరాలను తీర్చేటందుకు గాను యింకా అభివృద్ధిచేయవలెను.

వీటిని ప్రభుత్వంచేత అమలుజరిపించి ప్రజలకు అనేకవిధాల సౌకర్యాలు కల్పించేందుకు, తాము నిరుద్యోగానికి గురికాకుండా కాపాడుకొనుటకు రైల్వేకార్మికులు దేశమంతటా ఆందోళన సాగిస్తున్నారు. కొత్త రైల్వేలైన్లను నిర్మించాలన్న సూచన పై సూచనలలో ముఖ్యమైనది. కొత్త రైల్వే లైన్లు యేర్పడి వస్తువులయొక్క రవాణాలకు మరింత అవకాశాలు చేకూరుటవల్ల వివిధ పరిశ్రమలు తలెత్తి దేశం పారిశ్రామికంగా అభివృద్ధి అవుతుంది.

మన ఆంధ్రదేశంలో కొత్త రైల్వేలైన్లను అన్నిమూలల నిర్మించటంవల్ల యెన్నో పరిశ్రమలను ముందుకు తీసుకొనివచ్చుటకు పూర్తి అవకాశములున్నాయి. 67 వేల చదరపుమైళ్ళ విస్తీర్ణముగల ఆంధ్రదేశంలో 1800 మైళ్ళ రైల్వేలైనే వున్నది. ఇది యేమాత్రం రాష్ట్ర పురోభివృద్ధికి సహాయ పడజాలదు. కనుక యింకా కొత్తకొత్త రైల్వేలను స్థాపించవలెను. వంగోలు నుండి కనిగిరి, బద్వేలు, కడప, రాయచోటి, మదనపల్లి, శ్రీనివాసపురములమీదుగ కొత్త రైలుమార్గమును నిర్మించి మైసూరు సంస్థానమునకు కలుపవలెనని యున్నది. కడప నుండి నంద్యాలకు, కడపనుండి బెంగుళూరుకు రైలు మార్గములను నిర్మించవలెను యుద్ధానంతరపు నిర్మాణ కార్యక్రమమును గురించి ఆలోచించుటకుగాను జరిగిన కడపజిల్లా అధికారుల సమావేశంలో పై సూచన చేయబడింది. గూడూరునుండి కడపకు, రాజమండ్రి నుండి భద్రాచలానికి, విజయనగరం నుంచి బస్తర్‌గుండా చాందాకు రైలుమార్గాలను నిర్మించాలి. నెల్లూరు జిల్లాలో చిత్తూరు నెల్లూరు సరిహద్దులలో ఒక రైలుమార్గం, తూర్పు సరిహద్దున ఒకరైలుమార్గం వున్నదే కాని జిల్లాలోని మధ్యభాగాన్ని కలుపుతూ రైలుమార్గం లేనేలేదు. కనుక నెల్లూరు నుంచి జిల్లా మధ్యగుండా అదే జిల్లాకు చెందిన దనుకొండకు, ఒంగోలు నుండి వినుకొండద్వారా మాచెర్లకు, మాచెర్లనుండి నర్సరావుపేటకు, గురజాల నుండి నరసరావుపేటకు, గుంటూరు నుంచి అద్దంకికి ఏలూరునుంచినూజివీడు మీదుగా తిరువూరుకు చింతలపూడి నుంచి తిరువూరుకు, చింతలపూడి నుంచి భీమవరమునకు, కళ్యాణదుర్గం నుంచి ధర్మవరం, పులివెందలను కలుపుతూ కడపవరకు, కడపనుంచి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బంగనపల్లి కేంద్రాలను కలుపుతూ ద్రోణాచలము వరకు బళ్లారినుంచి ఆదోనికి, ఆదోనినుంచికర్నూలు, ఆత్మకూరు ఎర్రగొండపాలెములను కలుపుతూ మాచెర్ల వరకు రైలుమార్గములను వేయవలెను. ఇదే విధంగా యింకా అనేక ప్రాంతాలలో రైలు మార్గాల నిర్మాణమును మనము సూచించి ప్రభుత్వంచేత అమలుజరిపించవలసియున్నది.

పోలేపెద్ది నరసింహామూర్తి

రైలు మార్గము వెయ్యటానికి వీల్లేని మారుమూల ప్రదేశాలకు మట్టుకు బస్సు ట్రాన్సుపోర్టును ప్రవేశపెట్టమని రైల్వేమన్ ఫెడరేషన్ కోరుతుంటే, రైలు-ట్రాన్సుపోర్టు, రోడ్డు-ట్రాన్సుపోర్టు మధ్య కో-ఆర్డినేషన్ అనే సాకుపెట్టి రైలుమార్గాలను నిర్మించకుండా కూర్చుందామనుకుంటున్నది. ఆంధ్ర చాంబర్ అఫ్ కామర్సుయొక్క మెమోరాండమునకు ప్రభుత్వపు ట్రాన్సుపోర్టు మెంబరు అయిన బెంథాలు యిచ్చిన సమాధానమువల్ల, యిది స్పష్టమవుతున్నది (నవంబరు 8 ఇండియన్ ఎక్స్‌ప్రెస్). చిన్న రైలుమార్గములను నిర్మించకుండా బస్సుట్రాన్సుపోర్టును ప్రోత్సహించే సిద్ధాంతంతో ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. ఎక్కడ బలమైన ట్రాఫిక్ వుంటుందో అటువంటిచోట్లనే రైలుమార్గాలను ప్రవేశపెట్టుటకు ఆలోచిస్తుందనీ, అవకాశం లేనిచోట్ల లారీలు బస్సులవల్లనే పని సాధ్యమవుతుందనే అభిప్రాయంతో ప్రభుత్వం వున్నదని సమాధానమిచ్చారు. ఇది రైల్వే పరిశ్రమను అభివృద్ధిపర్చే ధోరణి కానేకాదు.

యుద్ధకాలంలో తీసివేసిన రైలుమార్గాలను తిరిగి తెరవాలన్న కోర్కెకు బెంథాల్ సమాధానం చెపుతూ, రైలుమార్గం పక్కగా రోడ్డు వున్నచోట్ల ప్రజలు బస్సులలో ప్రయాణము చేయుటంమంచిది. ప్రభుత్వం అటువంటి దానిని ప్రోత్సహిస్తుంది. కనుక వాటిని తిరిగి వేయనక్కర లేదన్నారు. వాగన్లు, బోగీలు యుద్ధరంగానికి పోయినవి కాబట్టి, అవి తిరిగి యిండియాకు వచ్చేంత వరకు గూడ్సుట్రాఫిక్‌మీద వున్న నిషేధాలు తొలిగించనికి వీలులేదని అన్నారు. ప్రయాణీకుల ట్రాఫిక్‌యొక్క ఒత్తిడిని యేమాత్రం తగ్గించలేము అన్నారు. ప్రభుత్వంయొక్క దకో యుద్ధరంగంలోకి పంపబడిన పెట్టెలు వచ్చేంతవరకు ప్రజలను యెదురుచూడమంటున్నదేకాని, రైల్వే వర్కుషాపులలో వాటిని నిర్మించేందుకు యిప్పటినుంచి పూర్తి అవకాశములను కల్పిద్దామనే వుద్దేశ్యం ప్రభుత్వానికి లేనేలేదు

ప్రజలు యెంతో కాలం నుంచి మూడవ తరగతి పెట్టెలలో ప్రయాణీకులకు అవసరమైన సౌకర్యముల కల్పించమని ఆందోళన చేస్తున్నారు. ప్రజలయొక్క యీ కోర్కెలను పురస్కరించుకునే, రైల్వేమన్ ఫెడరేషను పంకాలను యేర్పాటు చేయమని, స్నానాలకు నిద్రించుటకు వసతులనుకల్పించమని కోరింది. కాని, ప్రభుత్వం మూడవ తరగతి పెట్టెల విషయం యింకా ఆలోచనలో వున్నదని కాలంగడుపుతునే వున్నది. మరొకవైపు, అమెరికన్ మాడేల్ ప్రకారం మొదటి తరగతి పెట్టెలలో యెక్కువ సౌకర్యాలను కల్పించే విషయంలో బెంగుళూరు హిందుస్తాన్ విమాన ఫ్యాక్టరీకి చెందిన గాడ్‌ఫ్రె, వైట్, అను యిద్దరు కేంద్రప్రభుత్వపు ఉత్తరువు ననుసరించి నమూనాలు తయారుచేశారు. ప్రభుత్వంతో చర్చించి నిర్ణయములను తీసుకొనుటకు ఢిల్లీ వెళ్ళారు (నవంబరు 14, యిండియన్ యెక్స్‌ప్రెస్) రైల్వేలకు యెక్కువ ఆదాయం మూడవ తరగతి ప్రయాణీకులనుంచే వస్తూంది. కాని, వారి సౌకర్యాలను యేర్పాటుచేసే విషయంలో ప్రభుత్వం ఆలోచనలతోనే ఆగిపోతూంది.

రైల్వే పరిశ్రమను అన్నివిధాలా అభివృద్ధిపరచాలనే తలంపు యేకోశానా ప్రభుత్వానికి లేనట్టుగా స్పష్టమవుతున్నది. మనం రైలు మార్గాలను యెక్కువ చేయ మంటుంటే, బస్సులు లారీలు ద్వారా రవాణాలను నడుపుకుంటూ సంతృప్తి పడమంటున్నది. మనం యుద్ధ పరిశ్రమలవన్నిటిని ప్రజల అవసరాలను తీర్చే పరిశ్రమలుగా మార్చమని కోరుతుంటే, ప్రభుత్వం నిరాకరిస్తోంది.

రైల్వే కార్మికులు రైల్వే పరిశ్రమను అభివృద్ధిచేసి నిరుద్యోగాన్ని నిర్మూలింప చేయుటకు తమ ఫెడరేషన్ సూచించిన 16 పాయింట్ల కార్యక్రమమును ప్రభుత్వము చేత అంగీకరింప చేయుటకు దేశవ్యాపిత పోరాటమును సాగించబోతున్నారు. ఎన్. ఐ. రైల్వే లేబర్ యూనియన్; జి. ఐ. పి. రైల్వే మన్సు యూనియన్ సమ్మె సాగించుటకు కార్మికులలో ఓటింగు తీసుకొనుటకు నిర్ణయించాయి. ప్రభుత్వం ఈ 16 సూచనలను అంగీకరించకపోతే, రైల్వే యూనియన్లన్నీ పోరాటాన్ని సాగించుటకు సిద్ధమవుతున్నాయి రైల్వే కార్మికులుసాగిస్తున్న ఈ పోరాటం కేవలం తమ నెదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను పోగొట్టుకోటానికే కాకుండా ప్రజలందరిలో ప్రబలియున్న నిరుద్యోగాన్ని నిర్మూలించటానికి, రవాణాకు సంబంధించిన ప్రజల అవసరాలను పూర్తిగా తీర్చేందుకు సాగించు పోరాటం రైల్వే కార్మికుల సోదర ప్రజలు కలిసి సాగించవలసిన వుమ్మడి పోరాటం, ప్రజలు, కార్మికులుకలిసి ఆందోళన సలిపి విజయం సాధించకపోతే, ప్రభుత్వం యొక్క బర్తరపు విధానంవల్ల [illegible] కార్మికులు నిరుద్యోగులవుతారు. వారందరి యొక్క కొనుగోలుశక్తి నాశనమవుతుంది. దేశంలోతయారగు వివిధసరుకులునిలవవుండిపోయి ఆర్థికవిధానమంతా కుంటుపడుతుంది. దీనివల్ల నష్టపడేదికార్మికులేకాకుండా రైతులు మధ్యతరగతి ప్రజలు, చిన్నచిన్న వ్యాపారులు ఈ అరిష్టానికి గురిఅయి దేశాన్ని నాశనం కానివ్వకుండా చేయాలంటే, కార్మికులు, ప్రజలందరు కలిసి ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగాపోరాడాలి. వాణిజ్యసంస్థలు, విద్యార్థి సంఘాలు, రైతుసంఘాలు, కార్మిక సంఘాలు, రైల్వేకార్మికులు సూచించిన16పాయింట్ల కార్యక్రమమును బలపరుస్తూ, వారి పోరాటానికి తోడ్పడాలి. విజయం సాధించాలి.

(3 వ పేజీ తరువాయి) లేదు ఈనాడు రైతాంగ సమస్యలు తీర్చడానికి ప్రకాశం బిల్లు ఏమాత్రం సరిపోదు. సమూలంగా జమీందారీ పద్ధతిని రద్దుచేస్తేనేతప్ప నేటి రైతాంగ సమస్యలు పరిష్కారం గావు. అప్పుడు కూడ బిల్లు మరింత అభివృద్ధి కరంగా వుండుటకై చాలా మార్పులను సూచించింది. ఈనాం రైతులకు, కౌలుదార్లకు కలిగే అన్యాయాన్ని గట్టిగా ఖండించింది.

ప్రకాశంబిల్లు ఈనాడు చాలదు

ఈనాడు భారత జాతీయ జీవనాన్ని అంతటినీ పునర్నిర్మించే ప్రయత్నం జమీందారీ పద్ధతి రద్దుకానిదే జయం పొందదు. వ్యవసాయాన్ని పునర్నిర్మించాలి. ఇందుకై బ్రహ్మాండమగు ప్రాజెక్టులను నిర్మించాలి. బంజరు భూముల నన్నిటినీ సాగులోకి తేవాలి. పేద రైతులకూ, వ్యవసాయ కూలీలకూ, భూవసతులను కల్పించాలి. భూమి శిస్తు విధానాన్ని మార్చి పేదరైతులపై శిస్తులేకుండా చేయాలి, అధికాహారోత్పత్తిచేసి కరువులను, నివారించాలి ఇవన్నీ జరగనిదే రైతాంగంబాగుపడదు. ఇవన్నీ జరగాలంటే, జలాధారాలు, బంజరు భూములు, సాముదాయక భూములు వగైరా సమస్త భూములపై జమీందార్లకు పెత్తనం ఉండగూడదు. జమీందారీ విధానాన్ని పూర్తిగా రద్దుచేయాలి. అప్పుడేనవీన శాస్త్రీయపద్ధతుల ప్రకారం వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటం సాధ్యం అవుతుంది కాబట్టి రైతాంగంబాగు పడాలంటే, వ్యవసాయం అభివృద్ధి పొందాలంటే, జమీందారీపద్ధతితక్షణం రద్దుకావాలి. ప్రకాశంబిల్లు ఈ వ్యావసాయిక పునర్నిర్మాణానికి ఉపయోగపడజాలదు సరికదా, ఆటంకము కూడా. ఎన్ని రక్షణలు పెట్టినా, జలాధారాలు, సాముదాయిక భూములు, అడవులు మున్నగు కీలకాలపై జమీందార్ల పెత్తనం వున్నంతకాలం రైతుల కష్టాలు పోవు. శిస్తులను వసూలుచెయ్యడానికి ఈదళారీలు ఈనాడు అనవసరమగుటే గాక ఈ పద్ధతి, రద్దుచేస్తే జమీందార్లకు ఈ క్షయమయ్యే శిస్తులు కూడా ప్రభుత్వాదాయంలో చేర్చబడి ఆర్థిక పునర్నిర్మాణానికి ఉపయోగపడగలవు.

జంగ్ కైషేక్ కు అమెరికన్ల మద్దత్తు

చైనాలో అంతర్యుద్ధం

నవంబరు 18

చైనా కేంద్రప్రభుత్వానికి చెందిన నాల్గు డివిజన్లు, మంచూరియాకు సింహద్వారం వంటి షాన్‌హైక్వాన్‌ను వశపరచుకొన్నాయి. అందుచే చైనా కుడ్యం పొడవునా వున్న తమ స్థానాల నుండి కమ్యూనిస్టు సైన్యాలు ఉపసంహరించుకొంటున్నాయి.

షాన్‌హైక్వాన్‌కు ఈశాన్యంగా 100 మైళ్ళలో, పెకిన్-ముక్డెన్ రైల్వే మార్గంలోని లిన్‌సేన్‌వద్ద కమ్యూనిస్టు సేనలు నిలిచి యుద్ధం చేస్తాయని కమ్యూనిస్టు దినపత్రిక "చైనా డైలీన్యూస్" వ్రాస్తోంది.

"చైనా ప్రజలపై అమెరికా యుద్ధం"

షాన్‌హైక్వాన్‌లో మహాభయంకరమైన చిత్రవధకు, కమ్యూనిస్టు సేనలు గురిఅయ్యాయని కమ్యూనిస్టు ప్రధాన కార్యాలయం ప్రకటించింది.

షాన్‌హైక్వాన్ దగ్గిర జరిగిన యుద్ధం, చైనీయులకు చైనీయులకు జరిగిన అంతర్యుద్ధం అవడం కంటె, అది చైనా ప్రజలపై అమెరికా సేనలు గావించిన యుద్ధం అనవలెనని కమ్యూనిస్టు సైనిక ప్రధానకార్యాలయానికి చేరినవార్త తెలియజేస్తోంది.

అమెరికన్ ఆయుధాలతో సన్నద్ధమైన రెండు కొమింటాంగు సైన్యాలు, సముద్రతీరం నుండి వచ్చిన 60 వేల కిలొటొమ్మ సైన్యాలను కల్పుకొని, పెద్దయెత్తున 25 మైళ్ళ రంగంలో గురువారంనాడు యుద్ధం ప్రారంభించాయి. శుక్రవారంనాడు అయిదు గంటలు ప్రతిఘటన సాగించిన పిదప, కమ్యూనిస్టుసైన్యాలు ఉపసంహరించుకొన్నవి - అని సైన్య క్రమానం తెలియజేస్తుంది.

చైనాలో అమెరికా సేనాని జనరల్ వెడిమెయర్, తన సేనలను కేంద్ర ప్రభుత్వం తరపున ప్రవేశపెడుతున్నాడనీ, అతని ప్రకటనలలోనే ఈ పక్షపాతబుద్ధి బాగా వ్యక్తమౌతున్నదనీ కమ్యూనిస్టులు అంటున్నారు.

సోవియట్‌పై చైనాప్రభుత్వ పత్రికల విమర్శ

షాన్‌హైక్వాన్‌ను వశపరచుకొన్న పిదప ప్రభుత్వ సేనలకు మంచూరియాకు మార్గం ఏర్పడింది. ఇట్టిసమయంలో దక్షిణ మంచూరియాకు ప్రభుత్వ సేనలు చేరకుండానే, వాటిని సోవియట్‌సేనలు ఖాళీచేసి పోతున్నందుకు చుంకింగ్ పత్రికలు సోవియట్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నవి.

కమ్యూనిస్టుల విజయం

నవంబరు 19.

కుమింటాంగ్ పక్ష అభిప్రాయాలను ప్రతిబింబించే "సన్డు డైలీన్యూస్" అనే పత్రిక ఇలా వ్రాసింది :

"కమ్యూనిస్టులు ఈశాన్యచైనాలోని జనరలిస్మో ప్రధాన కార్యాలయాన్ని, మిగతా చైనానుండి వేరుపరిచారు. చాంగ్‌చున్‌లో సోవియటు అధికారులతోవున్న ఆరుగురు చైనా ప్రభుత్వోద్యోగులు తప్ప తక్కినవారంతా అక్కడనుండి పీపింగ్‌కు నిర్గమించారు.

మంచూరియాలో

చాంగ్‌చున్ గట్టిగా తమ వశంలో ఉండటంవల్ల ఈశాన్య చైనాలో స్వపరిపాలనను స్థాపించడానికి సిద్ధంగా ఉన్నామని, కమ్యూనిస్టులు చెబుతున్నట్లు రాయిటర్ ప్రత్యేక విలేఖరి డున్‌కాంప్ బెల్ తెలియజేస్తున్నాడు.

కాని కమ్యూనిస్టు ప్రధాన కార్యాలయం నుండి ఈ వార్త యదార్థంకాదని అధికారరీత్యా ప్రకటించబడింది. మంచూరియాలో తాము(ఆటానమస్) స్వతంత్రప్రభుత్వాన్నిస్థాపించుతున్నామనడంఅబద్ధమన్నారు. కానిప్రజాస్వామిక సూత్రబద్ధమైన ప్రభుత్వం అక్కడ ఏర్పడవచ్చునని కమ్యూనిస్టులు ప్రకటిస్తున్నారు.

కమ్యూనిస్టుసేనలు ఆర్థర్‌రేవులో, లేదా డైరన్ రేవులో (ఇవి సోవియటు ఆక్రమణ క్రింద వున్నాయి) వున్నారనువార్త అబద్ధమనికూడా వీరు ప్రకటించారు.

అంతర్యుద్ధ వ్యతిరేక ఆందోళన

చుంకింగ్ నవంబరు 19.

అంతర్యుద్ధాన్ని వ్యతిరేకించుచూ, చైనా అంతటా సార్వజనీన సమ్మె జరపాలనీ, ఆ సమ్మెలో సైనికులు, ఉద్యోగవర్గాలవారు, పారిశ్రామికులూ పాల్గొనాలనీ, ఇక్కడ జరిగిన ఒక బ్రహ్మాండమైన సమావేశంలో ప్రబోధించబడింది.

ఈ సభలో అన్ని రాజకీయ పక్షాలవారు పాల్గొన్నారు. పండితులు, కవులు, అధ్యాపకులు, వర్తకులు, పారిశ్రామికవేత్తలు అంతా అంతర్యుద్ధాన్ని మానివేయాలని కోరారు.

ఒకాయన ఉపన్యసిస్తూ కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు. ఆయన ఇలా అన్నాడు. "అమెరికన్లు ఆటంబాంబుమజూచి గర్వపడుతున్నారు కాని చైనా ప్రజాభిప్రాయం, పరమాణుశక్తి కంటె ప్రబలమైనది."

మరొక ఉపన్యాసకుడు, అమెరికా అరువు కౌలు సప్లయిక్రింద ఇంకా ఆయుధాలు పంపడంవల్ల 'అగ్ని మరింత రగులుతుంది' అని అన్నాడు.

డెమొక్రాటిక్ లీగు, విదేశవ్యవహార కమిటీకి ఉపాధ్యక్షురాలయిన హెర్మన్‌లూ సమ్మె చేయాలని ప్రతిపాదించింది. ఆమె యిలా అన్నది : "ఈసమ్మె మూలంగా చైనాజాతికి బుద్ధి వస్తుంది."

దిన పత్రిక

డిసెంబరు 3 వ తేదీని

"ప్రజాశక్తి" దినపత్రిక డిసెంబరు 1వ తేదీని గాక, 3వ తేదీన వస్తుంది. పాఠకులు, ఏజంట్లు గమనించ ప్రార్థన.

మేనేజరు.

ఫ్రాన్సులో నూతన మంత్రివర్గం

కమ్యూనిస్టులకు 5 స్థానాలు

పారిస్, నవంబరు 21.

జెనరల్ డీగాల్ నూతన మంత్రివర్గాన్ని ఏర్పరిచాడు. డీగాల్ ప్రధానమంత్రి పదవినీ, దేశరక్షణశాఖామంత్రిపదవినీ రెండింటినీ స్వీకరించుచున్నాడు.

దేశరక్షణశాఖలో డీగాల్‌కు, సైనికశాఖ మంత్రి ఎడూర్‌మిషిలో (క్రిస్టియన్ డెమాక్రటిక్ పార్టీ - దీనినే ఎం. ఆర్. పి. అని కూడా వ్యవహరిస్తారు.), ఆయుధశాఖ మంత్రి ఛార్లెస్ టిలా (కమ్యూనిస్టు)లు సహాయంగా ఉంటారు.

ప్రత్యేకశాఖకు దేనికీ బాధ్యతలేకుండా నల్గురు మంత్రులు నాల్గుపక్షాలవారు నియమించబడ్డారు. వీరు మారిస్‌థోరే (కమ్యూనిస్టు నాయకుడు); విన్సెంటు ఆరియో (సోషలిస్టు); ఫ్రాంసిస్ గే(క్రిస్టియన్‌డెమాక్రేట్) లూయీజాకినో (కన్సర్వేటివ్).

ఈ నూతన మంత్రివర్గంలో మొత్తం 5 గురు కమ్యూనిస్టులున్నారు. మారిస్‌థోరే గాక, ఈ క్రింది నల్గురు కమ్యూనిస్టులు మంత్రివర్గంలో ఉన్నారు.

జాతీయ ఆర్థికశాఖ : ఫ్రాంకోయీబిల్లో
కార్మికశాఖ : ఆంబ్రోయీ క్రోజా
పారిశ్రామికశాఖ : మార్సెల్‌పాల్
ఆయుధశాఖ : ఛార్లెస్ టిలా;

విదేశాంగశాఖకు జార్జి బిదో (ఎం. ఆర్. పి.) నియమించబడ్డారు.

కమ్యూనిస్టు నాయకులలో ఒకడైనా ఫ్లారిమన్‌బాంటి "ఈమంత్రివర్గం మూడు పెద్ద పక్షాలమధ్య సంఖ్యనుబట్టి, ప్రాముఖ్యాన్నిబట్టి బాగానే విభజింపబడిందనీ, బాగానే సాగవచ్చుననీ" అన్నారు. అయితే యుద్ధ, విదేశీయశాఖలలో ఏదో ఒకశాఖ తమ కీయవలసిందని కమ్యూనిస్టుపార్టీ కోరినకోర్కె మన్నిస్తే బాగుండేది. కాని డీగాల్ అలాచేయలేదు." అని అన్నాడు.

డీగాల్ అభిభాషణ

పారిస్, నవంబరు 23

ఫ్రెంచి ప్రజాపరిషత్తు (కాన్‌స్టిట్యూయెంటు అసెంబ్లీ) డీగాల్ మంత్రివర్గంలో విశ్వాసం ప్రకటించుచూ తీర్మానించింది. ఈ తీర్మానానికి పూర్వం డీగాల్ ఇలా ఉపన్యసించాడు.

"ప్రళయబాంబు ప్రమాదం నెత్తిమీద కూర్చున్న ఈరోజులలో, ఫ్రాంసు విదేశాంగనీతి, పశ్చిమ యూరప్‌దేశాల మధ్య సఖ్యత కోరడం.

ఫ్రెంచి రాజనీతి ముఠాల(బ్లాక్సు) చేర్పరచడంకాదు, సహకారం చేయడం, దానిఅర్థం కొన్ని దేశాలతో సంధి సంప్రదింపులు జరపరాదనీకాదు." 1944 లోని సోవియటు-ఫ్రాంసు ఒడంబడికను జ్ఞప్తికితెస్తూ, డీగాల్ ఇంకా ఇలా అన్నాడు, "కష్టాలుపడలాగానే, జర్మనీ భవిష్యత్తులో ప్రమాద భూయిష్టమైనదేశం కాకుండా ఉండేందుకు జాగ్రత్త తీసుకొంటున్న దేశం."

"ఈటువంటికను ఏఉద్దేశ్యంతో వేసుకొన్నామో, అదేవిధంగా అమెరికాతో మంచి సంబంధాలను కలిగి వుంటానికి ప్రయత్నిస్తున్నాము అదేవిధంగా బ్రిటనుకూ, ఫ్రాన్సుకూ ఉమ్మడిగా సంబంధించిన వ్యవహారాలలో సామరస్యాన్ని అర్థిస్తున్నాం. [illegible] మనం, పశ్చిమ యూరప్ దేశాలతో [illegible]గా బెల్జియం, హాలెండ్, దేశాలతో సన్నిహిత సంబంధాలు కోవాలి. దాని అర్థం మధ్య [illegible] దేశాల విషయంలోగాని, బాల్కాన్, నేవియన్ దేశాల విషయంలోగాని సంకెళ్ళు వేసుకో నవసరంలేదు

వలసదేశాలు, ముఖ్యంగా ఫ్రాంసుతో సహకారభావంతో [illegible] సహాయాన్ని పొందాలని డీగా[illegible] స్వాతంత్ర్యం అభివృద్ధి పొంద[illegible] దీన దేశాలు ఫ్రాన్సుసహాయ[illegible] డీగాల్ అన్నాడు.

కమ్యూనిస్టులు డీగాల్‌మంత్రివిశ్వాసంతో ప్రవర్తిస్తాము కాని, అంధంగా గుడ్డిగా అనుసరించమని హెచ్చరించారు.

సవరణలు

★

రాజమండ్రి సభలో జరిగిన ఘటనను గురించి శ్రీ పాలకోడేటి సూర్యప్రకాశరావు గారు యిలా వ్రాస్తున్నారు.

"14-11-45 'ప్రజాశక్తి' 10 వ పేజీలో "పట్టాభిలాఠీసిద్ధాంతం ఫలిస్తూంది" అనువ్యాసములో నాపేరు ఎత్తినారు. నేను అన్నమాటలు యివి: 'పిల్లకు దెబ్బతగలడం నిజమే. కాని రాయివిసిరినది ఎవరో తెలియదు కమ్యూనిస్టులను ప్రజలు అనుమానించుచున్నారు.' అంతేగాని, 'కమ్యూనిస్టులే విసిరారనడం తప్పు' అని నేనెన్నడూ చెప్పలేదు. సభలో 8 ఏండ్ల బాలికకు దెబ్బతగిలిన మాట నిజము. కమ్యూనిస్టులే రాళ్ళు వేశారని నేను చెప్పను. జనసామాన్యంలో మాత్రం కమ్యూనిస్టులమీద అనుమానం ఉన్నది. ఈ విషయము చెప్పక తప్పదు. సభలో కమ్యూనిస్టులకు కావలసినంత ప్రవర్తేషన్ యిచ్చినారని చెప్పకతప్పదు."

★

క్రిందటి సంచికలో "లక్ష్మణరావు దంపతుల విరాళం" అనే శీర్షికక్రింద, లక్ష్మణరావు గారు ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్షననుభవించినట్లు పడింది. అది పొరపాటు "ఉప్పుసత్యాగ్రహంలో శిక్షణ పొందేరు" అని సవరించుకొన గోరెదము.

పర్షియాలో సోవియట్ వ్యతిరేక ప్రచారానికి

'ఇజ్వెస్టియా' పత్రిక జవాబు

ఉత్తర పర్షియాయందలి అజర్‌బైజాన్ రాష్ట్రములో (టెహరాన్‌కు 86 మైళ్లు వాయువ్యంగా కాజివిన్ పట్టణంలో) కాంతిభద్రతలు నెలకొల్పడానికి పంపబడిన ప్రభుత్వ సేనలను సోవియట్ మిలిటరీ అధికారులు ఆపివే... పర్షియన్ ప్రభుత్వాధికారులు యీ ... వార్తను ప్రకటించారు.

... 17న పర్షియా ప్రభుత్వం సోవి... రాయబార వర్గంలో ఉదిగువ ... అమెరికాలోని పర్షియా రాయబారి ...

... ఇష్టంవచ్చిన చోటికి వెళ్ళ అవకాశం లేకుండా ఉంది. ... జరిగే విషాదకర ఘట... త్వం అరికట్టలేకపోతే, ఆ సోవియట్ మిలిటరీ అధికారు...

... టాబ్రింకు పంపదలచిన ... టెహరాన్‌లోని సోవియట్ ... దేశాంగ కార్యాలయంద్వారా ... వీటిని సోవియట్ అధికారు... నంత త్వరలో 'తెలియచేయ... రాం."

రాకపోకలకూ, పర్షియా సోరీ... మీద చెప్పటంకూ ఎలాంటి ఆటంకం కలిగించవద్దని ఇవతలిం సోవియట్ ప్రభుత్వాన్ని కోరిందట.

పర్షియా ప్రభుత్వం, అజర్‌బైజాన్‌లో జరిగినవంటూ కొన్ని ఘటనలను ఉదహరింపజేస్తూ, సోవియట్ సేనాధికారాలు, పర్షియా సైనికులను, పోలీసులను, అజర్‌బైజాన్‌లో శాంతి భద్రతలను నెలకొల్పనీయడం లేదనీ, ప్రభుత్వవ్యతిరేక ప్రచారం చేస్తున్నవారికి సోవియట్లు ఆగిజాన్ని సప్లయి చేస్తున్నదనీ ఆరోపించింది.

నిజ పరిస్థితులు

పర్షియా ఘటనలను గురించి సోవియట్ అధికార పత్రిక "ఇజ్వెస్టియా" వ్యాఖ్యానిస్తూ, తిరుగుబాటు ప్రాంతాల ప్రజలకు సోవియట్లు లారీలు ఆయుధాలను సప్లయిచేస్తున్నాయనే వార్తలు పచ్చి అబద్ధాలని ఖండించింది.

"అజర్‌బైజాన్‌లో ప్రారంభమయిన ప్రజాస్వామిక ఉద్యమంలో పాల్గొంటున్నవారిపై అభివృద్ధి నిరోధక భూస్వాములు తమ పాయుధ సేవకులను ఉసిగొల్పారు. దానితో అక్కడ సంఘర్షణ ప్రారంభమయింది.

"ఉత్తర పర్షియాలో టాబ్రిజ్, అర్డాబిల్, రజాయె, మారా మొదలైన పట్టణాలలోను, పల్లె ప్రాంతాల్లోను స్థానిక స్వపరిపాలన సంస్థలకు ఇటీవల ఎన్నికలు జరిగాయి వట్టణ, పల్లె ప్రజాసామాన్యం యీ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఈ ఎన్నికల సందర్భంలో బ్రహ్మాండమైన సభలు జరిగాయి; అన్నివర్గాల ప్రజలు వాటిలో విస్తారంగా పాల్గొన్నారు.

"ఉత్తర పర్షియా జనాభాలో అజర్‌బైజాన్ వారే అధిక సంఖ్యాకులన్న సంగతి అందరూ ఎరిగినదే. వీరికి తమ మాతృభాషలో పాఠశాలలను పెట్టుకోడానికిగాని, తమ గ్రంథాలను, పత్రికలను ప్రచురించుకోడానికిగాని ఇంతవరకు యెలాంటి హక్కు లేకుండా ఉండేది. అజర్‌బైజాన్ ప్రజల జాతీయవాంఛలను నెరవేర్చాలనీ; పర్షియాభాషను బోధించడంతోపాటు మాతృభాషలో పాఠాలను బోధించే పాఠశాలలను స్థాపించాలనీ; అజర్‌బైజాన్ భాషలో వ్యవహారాలు నడిపే న్యాయస్థానాలను స్థాపించాలనీ; స్థానిక మునిసిపాలిటీలు మొదలైన స్వపరిపాలన సంస్థలకు ఎన్నికలు పెట్టాలనీ, ఇలాంటి ప్రజాస్వామిక కార్యక్రమం తీసుకున్న పక్షం ప్రజల అభిమానాన్ని చూరగొనడం సహజమే.

"ఇప్పుడు ఉత్తరపర్షియాలో సాగుతూన్న ప్రజాస్వామిక ఉద్యమంలో అన్నివర్గాలవారు, కర్షకులు, కార్మికులు, వర్తకులు, మేధావులు, భూస్వాములు, ఉద్యోగులు, గుమస్తాలు - అందరూ పాల్గొంటున్నారు.

"అక్కడి ప్రజలకు సర్వసాధారణమైన ప్రజాస్వామికహక్కులను చేకూర్చి ఒకతాటిగా అభివృద్ధి పొందడానికే ఈ ఉద్యమం కృషి చేస్తుంది. ఇరాన్ రాజ్యాంగంలోనే అజర్‌బైజాన్ ప్రజలు అభివృద్ధి పొందాలని దీని ఆశయం.

అభివృద్ధి నిరోధకులతో ఘర్షణ

"పర్షియా రాజ్యాంగంలోనుంచి విడిపోవాలనే ఉద్దేశం ఈ ఉద్యమానికి లేదు. అయినప్పటికీ, విడిపోవాలనికోరుతున్నారంటూ సాకు చెప్పి స్థానిక పోలీసులు అమానుష దౌర్జన్యాలకు పూనుకున్నారు. అభివృద్ధి నిరోధకులైన భూస్వాములు ఈ దౌర్జన్యాలకు మద్దతు నిచ్చారు. ఈ అభివృద్ధి నిరోధక, ప్రజా వ్యతిరేక, శక్తులన్నీ ప్రజాస్వామికోద్యమాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాయి. సోరాబ్, మియానె జిల్లాలలో ఘర్షణలు జరిగాయికూడా.

"ఈ ఘర్షణలను సాకుగా తీసుకొని విదేశ పత్రికా సంస్థలు దుష్ప్రచారం ప్రారంభించాయి. ఇటీవల ప్రజాస్వామిక పద్ధతులపై జరిగిన ఎన్నికల విజయస్వరూపాన్ని మరుగు పరచడానికి పచ్చిఅబద్ధాలను ప్రచారం చేస్తున్నాయి ఉత్తర పర్షియాలో జరిగిన ఘటనలకు బాధ్యత సోవియట్లపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇటీవల పాలెస్తీనాలోను, ఈజిప్టులోను జరిగిన తీవ్ర సంఘర్షణతో మళ్ళాయిది ప్రారంభమయింది. వీటికి పూర్తి బాధ్యత బ్రిటిష్ అధికారులదే అన్న సంగతి అందరికీ తెలిసినదే. ప్రపంచదృష్టిని ఆఘటనలనుండి మళ్ళించడానికే లండను రేడియో (బి. బి. సి.) ఈ దుష్ప్రచారానికి పూనుకుంది. అంతేకాదు. సామ్రాజ్యవాద దానివత్వం లోంచి బయట పడడానికి ఇండొనీషియా ప్రజలు గావిస్తున్న స్వాతంత్ర్య పోరాటం గురించిగాని, దానిని అణచడానికి బ్రిటిష్‌వారు తీసుకుంటున్న చర్యలనుగురించిగాని, ఈ లండను రేడియో ఏమీ అనడంలేదు."

పశ్చిమ గోదావరిజిల్లా యువజన మహాసభ

పశ్చిమగోదావరిజిల్లా యువజనోద్యమ చరిత్రలో ఎన్నడూ కనివిని ఎరుగనంత బ్రహ్మాండంగా తణుకులో నాల్గవపశ్చిమగోదావరిజిల్లా యువజనమహాసభ నవంబరు 10 నుండి 13 వరకూ నాలుగురోజులు జరిగింది.

ఆంధ్ర యువజనోద్యమ సంస్థాపకులలో ప్రముఖులైన చంద్రరాజేశ్వరరావుగారు అధ్యక్షత వహించారు. అఖిలభారత విద్యార్థిసంఘ ప్రధానకార్యదర్శి శ్రీ సత్యపాల్ డాంగ్‌గారు మహాసభను ప్రారంభించారు. వైజ్ఞానిక సభలకు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘాధ్యక్షులైన శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు అధ్యక్షత వహించారు.

ఆటపాటల పోటీలతోను, యువజన సభల కార్యకలాపాలతోనూ, ఊరేగింపులతోనూ యీ నాలుగురోజులూ తణుకు పట్టణం కలకలలాడింది. "యువకులందరు లేచిరండోయ్, నవయుగం బయదేంచినదిదిగో" అని గంభీరస్వరాలతో పాడుతున్న పాటలతోను, వినాదాలతోను, ప్రతిరోజూ ప్రభాతఫేరీలు జరిగాయి. ఆటపాటలపోటీలలో 32 గ్రామాలనుంచి వచ్చిన మూడువందలమంది యువకులు పాల్గొన్నారు. యీ పోటీలలో పట్టణయువకులేగాక, జిల్లా యువజనసంఘ కృషిఫలితంగా విజ్ఞానపు ఛాయలు సోకని పల్లెప్రాంతపు రైతుకూలీ యువకులు కూడ చాలమంది పాల్గొన్నారు. చెడుగుడు పందెములలో అన్నిటికన్నమిన్నగా దెందులూరు 'వీరకెడార్ట్స్' టీము విజయం గాంచింది. ఏలూరు, నర్సాపురం టీములుకూడ చక్కని ఆటను ప్రదర్శించి ప్రజల ప్రశంసలకు పాత్రమయింది.

12, 13 తేదీలలో ప్రతినిధుల సమావేశం జరిగింది. వివిధ తాలూకాలనుండి అరుదెంచిన రెండువందలమంది ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

ముఖ్యంగా ప్రస్తుతరాజకీయ పరిస్థితులపై గావించిన తీర్మానంలో సత్వర స్వాతంత్ర్య సిద్ధికి కాంగ్రెసు, లీగు, కమ్యూనిస్టు సంస్థల ఐక్యతావసరాన్ని ఉద్ఘాటించారు. స్వతంత్రమైన విశాలాంధ్రరాష్ట్ర నిర్మాణానికై ఆంధ్రరాజకీయ రంగంలో ప్రధాన సంస్థలైన కాంగ్రెసు - కమ్యూనిస్టుపార్టీలు ఐక్యం గావించవిగా కోరారు. యువజన సంఘం ఏ రాజకీయ పక్షానికి అనుబంధసంఘం కాదనీ, సంపూర్ణ సామరస్యాన్ని వాంఛిస్తున్నదనీ వెల్లడించారు. ఆటుతర్వాత ఆజాద్‌హిండ్ ఫౌజు సైనికుల విముక్తి, ఇండొనీషియా, ఇండోచైనాల స్వాతంత్ర్య పోరాటాల యెడ సానుభూతి, తుపాను బాధితులగు ప్రజల నష్ట పరిహారాని కవసరమైన సూచనలు తెలియ పరుస్తూ, మరికొన్ని ముఖ్యమైన తీర్మానాలు గావించారు.

నూతన సంవత్సరానికి శ్రీ పిచ్చా వెంకటరత్నంగారిని అధ్యక్షులుగానూ, శ్రీ వి. వి. యస్. శర్మగారిని ప్రధాన కార్యదర్శిగానూ, ఎన్నుకున్నారు.

నూతన సమాజ నిర్మాణానికై సాగిపోతున్న సైనికులవలె 500 మంది యువకులతో మహాసభకుముందు ఊరేగింపు జరిగింది. సాయంకాలం 6 గంటలు అయ్యేసరికల్లా శ్రీ రాజేశ్వరరావుగారి అధ్యక్షతను మహాసభ ప్రారంభమైంది. రాష్ట్రియువజన నాయకుడు శ్రీ వి. వి. దాసుగారు "స్వాతంత్ర్యం, శాంతి, అభ్యుదయం" చిహ్నలతో అలరారుతున్న యువపతాకాన్ని ఎగురవేశారు. తర్వాత అఖిల భారత విద్యార్థి ఫెడరేషను కార్యదర్శి శ్రీ సత్యపాల్‌డాంగ్ గారు మహాసభను ప్రారంభిస్తూ ప్రపంచమంతట సంఘటితమైన యువజనోద్యమాల పానిజాన్ని పరిమార్చుటకై పోరాడిన పద్ధతులనూ, స్వాతంత్ర్య సంరక్షణకై సాగించిన సమరసన్నాహంనూ విశదీకరించారు. దాసిన దేశాలలోని యువజనులు ఐక్య స్వాతంత్ర్యోద్యమాలను నిర్మించుటకై కృషిచేయవలసిన అవసరాన్ని వివరించారు.

తర్వాత సభాధ్యక్షులు శ్రీ చండ్ర రాజేశ్వరరావుగారు ప్రసంగిస్తూ ఆధునిక యంత్ర పరిశ్రమలను పెంపొందించి, సర్వైశ్వర్య సంపన్నమైన విశాలాంధ్ర నిర్మాణానికి యువకులు సర్వదా కృషిచేయాలన్నారు.

మహాసభ జయప్రదంగా జరగాలని ఆశీర్వదిస్తూ అఖిలభారత ట్రేడుయూనియన్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ మృణాలకాంతి బోసు, సర్దార్ పృథ్వీసింగు, ఆంధ్ర వారపత్రిక సంపాదకులు శ్రీ ముల్లంపల్లి సోమశేఖరశర్మగారలు పంపిన సందేశాలను చదివి వినిపించారు. ఆటపాటల పోటీలలో గెలుపొందిన యువకులకు బహుమతులు కూడ సభలో పంచిపెట్టబడ్డాయి.

వైజ్ఞానికసభలకు అధ్యక్షత వహిస్తూ శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు వయోజన విద్య, గ్రంథాలయాలు మున్నగువాటిద్వారా విజ్ఞాన వ్యాప్తికై యువకులు పూనుకోవాలన్నారు. రాత్రి పాఠశాలలద్వారా నిరక్షరాస్యులకు చదువునేర్పి విద్యార్హతతో ఓటింగు హక్కును కలిగించిన జిల్లా యువజనసంఘ కృషిని అభినందించారు.

ఉపన్యాసాల అనంతరం వక్తృత్వంలోను, సంగీతంలోను పోటీలుజరిగాయి. వక్తృత్వంలో విదదివోలువా ప్రథములు తీర్థం వెంకటరత్నంగారు, పాటలపోటీలో సూర్యనారాయణ అనే బాలుడు ప్రథములుగా వచ్చారు.

ఈ సభల సందర్భంలోనే ఆరోగ్య ప్రదర్శనమూ, వైజ్ఞానికప్రదర్శనాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. మొత్తం మూడువేలమంది ప్రజలు ఆరోగ్య ప్రదర్శనాన్ని చూచారు.

13వ తేదీ రాత్రి పదిగంటలకు వైజ్ఞానిక ప్రదర్శనాలు ప్రారంభమయ్యాయి. 5000 మంది ప్రజలతో సభాస్థలమంతా కిటకిటలాడింది. దొంగవ్యాపారస్తులు చేసే కుతంత్రాలను, వాలంటీర్ల కృషినీ వివరిస్తూ పాలకొల్లు యువజన వైజ్ఞానిక దళంవారు చూపిన ప్రదర్శనం చాలాబాగుంది. తణుకు విద్యార్థి దళంవారు ప్రదర్శించిన "వద్దంటే పెళ్ళి" "రాజకీయ వైద్యుడు" అనే ప్రదర్శనాలు, తణుకు యువజన దళంవారు పాడిన సమిష్టి గానాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. అనంతరం 'కష్టజీవి' బుఱ్ఱకథ చెప్పబడింది.

Editor : M. Chandrasekhara Rao. Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada

END OF ISSUE